
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
సోమవారం, 4 నవంబరు 2024

భద్రాద్రిలో 26 కేజీల గంజాయి పట్టివేత

భద్రాచలం నవంబర్ 3(ఆంధ్రజ్యోతి): సీలేరు నుంచి బెంగళూరుకు భద్రాచలం మీదుగా కారులో తరలిస్తున్న గంజాయిని భద్రాచలం పోలీసులు ఆదివారం రాత్రి పట్టుకున్నారు. కేరళకు చెందిన సదకుతుల్లా సీలేరులో గంజాయి కొనుగోలు చేసి కారులో తరలిస్తుండగా భద్రాచలంలోని గోదావరి వారధి వద్ద స్థానిక ఎస్ఐ విజయలక్ష్మి తమ సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తూ కారును ఆపి తనిఖీ చేయగా అందులో 26 కేజీల గంజాయి లభించింది. దీంతో నిందితుడు సదకుతుల్లాను అదుపులోకి తీసుకుని పోలీసులు పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.



ఆధిపత్య పోరులో 'ఖేల్' ఖతం!

మారుమూల గ్రామీణ ప్రాంతాల నుంచి మెరికల్లాంటి క్రీడాకారులను వెలికితీసి వారిని జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల వరకు ఎదిగేలా ప్రోత్సహించేవే క్రీడా సంఘాలు.. కానీ అలాంటి క్రీడా సంఘాలు జిల్లాలో అందుకు విరుద్ధంగా పని చేస్తున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని క్రీడా సంఘాల రూటే సపరేటుగా కనిపిస్తోంది. క్రీడా సంఘాలను సుదీర్ఘ కాలంగా కొంతమంది అక్రమార్కులు తమ గుప్పిట్లో ఉంచుకొని క్రీడా రంగాన్ని కుదేలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. క్రీడా సంఘాల్లో పదవులు కొందరికి చందాల రూపంలో కాసులు కురిపిస్తుండగా మరికొందరికి తమ వ్యక్తిగత ఉనికిని చాటుకునేందుకు వేదికలుగా మారుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో క్రీడాకారులకు ఏదైనా సమస్య వస్తే వారి సమస్యలను పట్టించుకునే నాథుడే లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- జిల్లాలో పుట్టగొడుగుల్లా క్రీడా సంఘాలు
- ఇతర ప్రాంతాల వారి చేతుల్లోనే అనేక సంఘాలు
- సుదీర్ఘ కాలంగా వారి కనుసన్నల్లోనే వ్యవస్థలు
- సంఘం బైలాకూ తిలోదకాలు
- స్థానిక క్రీడాకారులకు అందుబాటులో ఉండని బాధ్యులు
- తీవ్రంగా నష్టపోతున్న క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్రీడా సంఘాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఒకే క్రీడాంశానికి రెండు, మూడు క్రీడా సంఘాలు తయారయ్యాయి. ఆయా సంఘాల్లో రాజకీయ పలుకుబడులు, పైరవీలు, అవినీతి విరాజిల్లుతోంది. వీటన్నింటికీ క్రీడా సంఘాల ఎన్నికలు బైలాలోని నిబంధనల ప్రకారం జరగక పోవడమేనని కారణమని క్రీడా నిపుణులు పేర్కొంటున్నారు. అంతే కాకుండా శాట్స్ నిబంధనల ప్రకారం మూడు నెలలకు ఒకసారి ఏదైనా క్రీడా సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించుకోవాలి. నాలుగేళ్లకు ఒకసారి ఎన్నికలు నిర్వహించుకోవాలి. కానీ ఇక్కడ అలాంటిది ఏమీ జరగడం లేదని పలువురు క్రీడాభిమానులు ఆరోపిస్తున్నారు. క్రీడా సంఘాల ఎన్నికలు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్స్) బైలా ప్రకారం జరిగితే క్రీడారంగం అభివృద్ధే కాకుండా జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి ఖ్యాతిని తీసుకొచ్చే మెరికల్లాంటి క్రీడాకారులు తయారవుతారని క్రీడాభిమానులు పేర్కొంటున్నారు.

ఇతర జిల్లాలు, ప్రాంతాల వారి చేతుల్లో క్రీడా సంఘాలు

జిల్లాలోని కొన్ని క్రీడా సంఘాలు ఇప్పటికీ ఇతర జిల్లాలు, ప్రాంతాల వారి చేతుల్లోనే ఉన్నాయి. వారు కీలక పదవుల్లో కొనసాగుతూ బైలా నిబంధనలు బేఖాతర్ చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతే కాకుండా సుదీర్ఘ కాలంగా కొంత మంది అక్రమార్కులు క్రీడా సంఘాలను తమ గుప్పిట్లో పెట్టుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వారికి చేయి తడిపిన వారిని ప్రతిభ లేకపోయిన క్రీడా ఎంపికల్లో ఎంపిక చేస్తుండటం గమనార్హం.. జిల్లాలో ఉన్న సుమారు 40 క్రీడా సంఘాల్లో ప్రతి ఒక క్రీడా సంఘం డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీకి జవాబుదారీగా ఉండి, శాట్స్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి. కానీ కనీసం ఒక్క క్రీడా సంఘం కూడా బైలా పాటించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

నూతన క్రీడా పాలసీకి తిలోదకాలు

రాష్ట్ర ప్రభుత్వం నూతన క్రీడా పాలసీని అందుబాటులోకి తెచ్చి, క్రీడాకారులను, క్రీడా రంగాన్ని అభివృద్ధి చేయడానికి కార్యచరణ రూపొందిస్తోంది. అందుకు అనుగుణంగా క్రీడా సంఘాలు వ్యవహరించకపోవడంతో నూతన క్రీడా పాలసీ ఏ మేరకు అమలవుతుందోనని పలువురు క్రీడా నిపుణులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర నూతన క్రీడా పాలసీలో క్రీడా సంఘాల బైలా నిబంధనలు కఠినతరం చేయాలని, తద్వారా క్రీడా రంగం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొంటున్నారు.



చేకూరి కాశయ్య విగ్రహానికి నమస్కరిస్తున్న మంత్రి తుమ్మల

సంకల్ప బలంతో ఏదైనా సాధ్యమే

- గురుదక్షిణ ఫౌండేషన్ అభివృద్ధికి కృషి
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఖమ్మంలో మాజీ ఎమ్మెల్యే చేకూరి కాశయ్య విగ్రహావిష్కరణ

వివరాలు : 6లో



పురుషుల విభాగంలో ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన కేఎండీసీ ఖమ్మం జట్టు

ముగిసిన కేయూ అథ్లెటిక్స్ పోటీలు

- పురుషుల విభాగంలో ఓవరాల్ చాంపియన్‌గా ఖమ్మం కేఎండీసీ జట్టు
- మహిళల విభాగంలో ఓవరాల్ చాంప్‌గా కొత్తగూడెం సింగరేణి మహిళా కళాశాల జట్టు

వివరాలు : 6లో

మళ్లీ మొదటికొచ్చిన
బేతుపల్లి భూ సమస్య

- తాజాగా సర్వేకు అధికారుల ఆదేశం
- అనర్హులను తొలగించాలని అధికారుల నిర్ణయం
- ఎప్పటికప్పుడు సర్వేలతోనే సరి
- శాశ్వత పరిష్కారంపై రైతుల్లో అనుమానాలు

6

రేపటి నుంచి ఉట్నూరులో
రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు

- ఉమ్మడి జిల్లా నుంచి పాల్గొననున్న 248 మంది క్రీడాకారులు
- కిన్నెర సానిలో ముగిసిన శిక్షణ
- కోచింగ్ ఇచ్చిన పలు రాష్ట్రాల కోచ్‌లు
- పతకాలు సాధిస్తామని విశ్వాసం వ్యక్తం చేసిన పీడీ మణెమ్మ

6

క్రీడాకారులు గెలవాలంటే
ఆకాంక్ష ఉండాలి

- భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి. పాటిల్
- కొత్తగూడెంలో రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు ప్రారంభం

7



శివ లింగానికి అభిషేకం చేస్తున్న మంత్రి తుమ్మల



ప్రసంగిస్తున్న మంత్రి పొంగులేటి

ఉద్యోగులకు అండగా ఉంటాం

- ప్రభుత్వాల తలరాత మార్చే శక్తి ఉద్యోగులకే ఉంది
- మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఖమ్మంలో ఉత్సాహంగా సకల ఉద్యోగుల వనసమారాధన
- హాజరైన ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, పలువురు ఉద్యోగ నేతలు

ఖమ్మం(ఆంధ్రజ్యోతిప్రతినిధి)/ఖమ్మం కలెక్టరేట్(ఆంధ్రజ్యోతి), నవంబరు 3: ఉద్యోగులకు తమ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, ఉద్యోగుల అన్ని సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లా ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ఖమ్మంలోని చెరుకూరి మామిడితోటలో ఆదివారం సకల ఉద్యోగుల వనసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల, పొంగులేటి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వాల తలరాతను మార్చే శక్తి ఉద్యోగులకే ఉంటుందన్నారు. వారు తల్చుకుంటే ప్రభుత్వాలను తలకిందులు చేయొచ్చన్నారు. రాజకీయ నాయకులు ఐదేళ్లే ఉంటారని, ప్రభుత్వ ఉద్యోగులు మాత్రం 30 ఏళ్ల సర్వీస్‌లో కొనసాగుతారని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో విసిగి వేసారి పోయిన ఉద్యోగులు తమ అభిప్రాయాన్ని బ్యాలెట్ పేపర్‌తో చూపించారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు ఉద్యోగులు అందిస్తున్న చేయూత ఎప్పటికీ మరువలేమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఆశించినట్లే ప్రజాపాలన కొనసాగుతోందన్నారు. రాష్ట్రంలో ఉద్యోగుల సమస్యలు బాధలు అన్ని ప్రభుత్వం దృష్టిలో ఉన్నాయని మంత్రి తెలిపారు. అయితే వాటిని పరిష్కరించేందుకు కొన్త సమయం కావాల్సి ఉందన్నారు. ఉద్యోగులు చేసిన మంచి పనులతో వారు ప్రజల మనస్సులో జీవితాంతం గుర్తుండి పోతారన్నారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం కొంత ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ఉద్యోగులకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చి తీరుతామన్నారు. ఉద్యోగులు కూడా ప్రభుత్వంలో భాగస్వాములు కావాలని మంత్రి తుమ్మల పిలుపునిచ్చారు. ఉద్యోగులు నీతి, నిజాయితీతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. ఎక్కడా అక్రమ మార్గాలవైపు చూడకూడదన్నారు.

జనవరి నాటికి సమస్యలు పరిష్కరిస్తాం
రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు అండగా ఉంటుందని, జనవరి నాటికి ఉద్యోగుల సమస్యల (మిగతా 6వ పేజీలో)

ఖమ్మం వేదికగా పాటల రికార్డ్

గాయని నాగశ్రీకి ధ్రువపత్రం అందించిన విశ్వం సంస్థ ప్రతినిధులు

ఖమ్మం సాంస్కృతికం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రం వేదికగా ఆదివారం పాటల విభాగంలో ఇంటర్‌నేషనల్ రికార్డు నమోదైంది. గాయని నాగశ్రీ తన సుదీర్ఘగానంతో ఈ అరుదైన రికార్డును నెలకొల్పారు. 12గంటల పాటు నిరాటంకంగా పాటలు పాడినందుకు గానూ 'విశ్వం' అనే సంస్థ ఆమె ప్రతిభను గుర్తించి గుర్తింపు పత్రాలు అందజేశారు. ఉదయం 8 గంటలకు పాడటం ప్రారంభించి రాత్రి 8గంటల వరకు నిరాటంకంగా పాటలు పాడారు. బృందగానాలు, డ్యూయెట్ పాటల సమయంలో ఇతర గాయనీ గాయకులు ఆమెతో కలిసి పాడారు. ఇందుకోసం రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు గాయనీ గాయకులు ఖమ్మం విచ్చేశారు. విశ్వం సంస్థ ప్రతినిధులు ప్రత్యక్షంగా ఈ పాటల కార్యక్రమాన్ని రికార్డు చేయటంతో పాటు గాయని నాగశ్రీకి ధ్రువపత్రాలను అందజేశారు. బాపట్లకు చెందిన నాగశ్రీ చిన్నప్పటినుంచే పాటలు పాడటాన్ని హాబీగా మలుచుకుంది. ఆమెలోని ప్రతిభను గుర్తించిన అధ్యాపకులు పాఠశాలస్థాయిలో పాటల పోటీల్లో ప్రోత్సహించారు. నాగశ్రీ అలా పాటలపై మక్కువ పెంచుకొని ఎంతో కృషి చేసింది. ఈమె భర్త



భక్తరామదాసు కళాక్షేత్రంలో పాటలు పాడుతున్న నాగశ్రీ

వ్యవసాయం చేస్తూనే కొంత కాలం హైదరాబాద్‌లో క్యాంటీన్ నడిపారు. ఆ సమయంలో స్థానికంగా సంగీత గురువుల వద్ద తన ప్రతిభను మెరుగు పరుచుకుంది. హైదరాబాద్ త్యాగరాయ గానసభలో ఆమె గతంలో 30 గంటల పాటు నిర్విరామ గాన ప్రదర్శనతో వండర్ రికార్డ్స్‌లో చోటు సాధించారు. దానితోపాటు ఇప్పటి వరకు 11సార్లు పలు సంస్థల ద్వారా అంతర్జాతీయ రికార్డులు సాధించారు. స్థానికంగా కళాదరణ దృష్ట్యా 12వ అవార్డు నెలకొల్పేందుకు ఖమ్మం నగరాన్ని ఎంచుకున్నారు.

ప్రాణం తీసిన జెండా కర్ర

- విద్యుదాఘాతంతో ఇద్దరు సెక్యూరిటీ గార్డుల మృతి
- ఓ స్కూల్ వద్ద జెండా పైప్ తొలగిస్తుండగా హెచ్‌టీ లైన్‌కు తగిలిన రాడ్
- మణుగూరు మండలం మల్లారంలో ఘటన





ప్రమాదంలో మృతిచెందిన రత్నం, ఉపేందర్

మణుగూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లా మణుగూరు మండలం వాగు మల్లారం గ్రామంలోని గ్రేస్‌మిషన్ పాఠశాలలో ఆదివారం ఉదయం జరిగిన ఓ విద్యుత్ ప్రమాదంలో ఇద్దరు సెక్యూరిటీ గార్డులు మృతి చెందారు. మణుగూరు మండలంలోని శివలింగాపురం గ్రామానికి చెందిన బేతం రత్నం (59), కాళీమాత ఏరియాకు చెందిన తిగుళ్ల ఉపేందర్ (47) ఈ ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. వీరిద్దరూ శనివారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి బయలు దేరే సమయంలో పాఠశాలలోని ప్రహరీ పక్కన ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన స్కూల్ పబ్లిసిటీ జెండా ఐరన్ పైపుల్లో ఓ పైపును తొలగించే క్రమంలో గోడపై ఉన్న హైటెన్షన్ విద్యుత్ లైన్‌కు ఆ పైపు తగిలింది. దీంతో ఇద్దరు గార్డులు విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ సతీస్‌కుమార్, ఎస్ఐ మేడ ప్రసాద్, రంజిత్‌లు పాఠశాలకు చేరుకుని వివరాలు సేకరించి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సెక్యూరిటీ గార్డుల మృతదేహాలను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మాజీ ఎమెల్యే రేగా కాంతారావు, సీపీఐ నేత బి. అయోధ్య తదితర నాయకులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.


ప్రసంగిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సాగుచేస్తున్న రైతులకు 'భరోసా'

- ఏజెన్సీ ప్రాంతాల్లో ఆయిల్‌పాం సాగు లాభదాయకం
- జిల్లాలో నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీల ఏర్పాటుకు పరిశీలన
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఇల్లెందు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతు రుణమాఫీలో సాంకేతిక అంశాలతో నిలిచిన రైతుల రుణమాఫీలో నాలుగు లక్షల కుటుంబాల నిర్ధారణ జరిగిందని, వారికి త్వరలో రుణమాఫీ జరుగుతుందని, రూ7,500 చొప్పున రైతుభరోసా పథకాన్ని అమలు చేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.

ఆదివారం రాత్రి ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గం ప్రమాణస్వీకారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిగా పాల్గొ న్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆయిల్‌పాం సాగు లాభదాయకమని, అవసరమైతే ఇల్లెందు ఏరియాలో ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లాలో నూతన వ్యవసాయ మార్కెట్‌లను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు పరిశీలిస్తున్నామని తెలిపారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

అప్పులకు ఏటా రూ.18వేల కోట్లు భారం

గత పాలకులు రూ7.19లక్షల కోట్లు అప్పుల భారంమోపారని, ఆ అప్పులకు రూ.71వేల కోట్లు వడ్డీలు చెల్లిస్తున్నామని, పేద ప్రజలకు అందవలసిన సొమ్ము బీఆర్‌ఎస్ మోపిన భారాలకు చెల్లించవలిసి వస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. కారుకూతలు కూస్తున్న గత పాలకుల మాదిరిగా సంక్షేమ పథకాలు ఎగవేసే వైఖరి తమ రక్తంలో లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బానోతు రాంబాబు, ఇతర పాలక వర్గ సభ్యులతో మార్కెట్ కమిటీ అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు.

ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యేలు కోరం కనకయ్యతో పాటు పాయం వెంకటేశ్వర్లు, మాలోతు రాందాసు నాయక్, తెల్లం వెంకట్రావు, ఐడీసీ చైర్మన్ మువ్వ విజయ్‌బాబు, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర రావు, వ్యవసాయ కమిషన్ సభ్యులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి తదితరులు ప్రసంగించారు. మార్కెట్ కమిటీ పాలక వర్గ ప్రమాణ స్వీకారానికి మూడు నియోజక వర్గాలకు చెందిన వేలాదిమంది ప్రజలు హాజరుకావం గమనార్హం.

హక్కుల చట్టాన్ని సద్వినియోగించుకోవాలి

- హ్యూమన్ రైట్స్ సొసైటీ జాతీయ అధ్యక్షుడు ఇనపనూరి మహేంద్రనాథ్



ప్రసంగిస్తున్న ఆదూరి ఆనందం

సత్తుపల్లిరూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల హక్కుల చట్టం-2016ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని హ్యూమన్ రైట్స్ సొసైటీ జాతీయ అధ్యక్షుడు ఇనపనూరి మహేంద్రనాద్, వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు ఆదూరి ఆనందం అన్నారు. వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం సత్తుపల్లిలో నిర్వహించిన దివ్యాంగుల హక్కులు, చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వికలాంగులకు ప్రభుత్వం చాలా రకాల పథకాలను ప్రవేశ పెట్టిందని, అర్హులు వాటిని పొందాలని కోరారు. ఈకార్యక్రమంలో రవికుమార్, మణి, విజయరావు పాల్గొన్నారు.

మళ్లీ మొదటికొచ్చిన బేతుపల్లి భూ సమస్య

- తాజాగా సర్వేకు అధికారుల ఆదేశం
- అనర్హులను తొలగించాలని అధికారుల నిర్ణయం
- ఎప్పటికప్పుడు సర్వేలతోనే సరి
- శాశ్వత పరిష్కారంపై రైతుల్లో అనుమానాలు

సత్తుపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలం బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని 133 సర్వే నెంబర్‌లో భూ యజమానులు దశాబ్దాల తరబడి సమస్యలు ఎదుర్కొంటున్నారు. వాస్తవంగా ఇక్కడ భూమి లేని వారు కూడా ఇదే సర్వే నెంబర్‌లో భూములు ఉన్నట్లు హక్కులు (టైటిల్) పొందటంతో సమస్య ఏర్పడింది. ఈ సమస్యకు గ్రామ స్థాయి రెవెన్యూ సిబ్బంది కారణం. దీంతో భూమిని సాగుచేసుకుంటూ అన్ని హక్కులు కలిగి ఉన్న భూయజమానులు మాత్రం రికార్డుల్లో నమోదు కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్ని ప్రభుత్వాలు, అధికారులు మారినా ఎప్పటికప్పుడు సమస్య పరిష్కరిస్తామంటూ హామీలే తప్ప శాశ్వత పరిష్కారం మాత్రం సాధ్యపడలేదు. దీంతో భూ యజమానులు టైటిల్ లేక రుణాలు, రైతు బంధు, ఇతర ప్రయోజనాలు దక్కక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రెండు పర్యాయాలు 133 సర్వే నెంబర్‌లో ఎంజాయ్‌మెంట్ సర్వే చేసినా సమస్య పరిష్కారం కాలేదు.

133 సర్వే నెంబర్ పూర్వపరాలు

బేతుపల్లి రెవెన్యూలో 133 సర్వే నెంబర్‌లో ఖాస్రా పహణీ ప్రకారం మొత్తం 3,090 ఎకరాల విస్తీర్ణం ఉంది. కాని గతంలో మాన్యువల్ పహణీ ఉన్న రోజుల్లో దాదాపు అంతకు రెట్టింపు విస్తీర్ణంలో రైతుల పేర్లతో నమోదు చేసారనే ఆరోపణలున్నాయి. ధరణి పోర్టల్ ప్రవేశపెట్టే సమయంలో రూపొందించిన సాఫ్ట్‌వేర్‌లో ఖాస్రా పహణీలో నమోదై ఉన్న 3090 ఎకరాల విస్తీర్ణం కంటే సెంటు భూమి కూడా అదనంగా పేర్లు, విస్తీర్ణం నమోదయ్యే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో అంత విస్తీర్ణంలోనే రైతుల పేర్లు నమోదయ్యాయి. ఈ క్రమంలో వాస్తవంగా తరతరాలుగా సాగులో ఉండి అన్ని హక్కులు ఉన్న రైతుల పేర్లు ధరణిలో నమోదు కాలేదు. పాస్‌పుస్తకాలు కూడా జారీ కాలేదు. పొజిషన్‌లో లేని, భూమి వారి పేర్లు మాత్రం నమోదయ్యాయి. రైతులు ధరణి గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసినా ఆర్‌ఎస్‌ఆర్ ఖాళీ లేదంటూ అర్హులైన రైతుల దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. అర్హులైన రైతుల పేర్లు ధరణిలో నమోదు కాకపోవటంతో బ్యాంకు రుణాలు అందలేదు. ప్రభుత్వ పరంగా కూడా ఏ రకమైన లబ్ధి చేకూరలేదు.


బేతుపల్లి సర్వేనెం.133లో సాగవుతున్న వరి, ఆయిల్‌పాం

దీంతో తాజాగా మరో సారి ఎంజాయ్‌మెంట్ సర్వేకు అధికారులు ఆదేశించారు.

2016, 2021లలో ఎంజాయ్‌మెంట్ సర్వే

133 సర్వేనెంబర్‌లో ఇబ్బందులు ఉండటం, రైతుల మధ్య వివాదం కూడా జరగటంతో 2016లో మొత్తం విస్తీర్ణం సర్వే చేయాలని జిల్లా అధికారులు నిర్ణయించారు. సర్వేయర్లు కొంత మేర సర్వే చేసినా అప్పట్లో వచ్చిన అభ్యంతరాల మేరకు సర్వే మధ్యలోనే నిలిపివేసారు. 2021లో సమస్య అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి వెళ్లటంతో పూర్తి స్థాయిలో ఎంజాయ్‌మెంట్ సర్వే జరిపించి వాస్తవంగా ఎవరైతే అర్హులో వారికి టైటిల్ ఇవ్వాలని, అర్హత లేని వారిని ధరణి పోర్టల్ నుంచి తొలగించాలని ఆదేశించారు. ఈ మేరకు అప్పటి జిల్లా కలెక్టర్ గంగారంలో రైతులతో సమావేశం నిర్వహించి పూర్తి స్థాయిలో ఎంజాయ్‌మెంట్ సర్వే చేస్తామని న్యాయం చేస్తామని ప్రకటించారు. సర్వే పూర్తి అయినా ఇది కూడా ముందుకు సాగలేదు. కొందరికి మాత్రమే పాస్‌పుస్తకాలు జారీ అయ్యాయి.

అక్రమ రిజిస్ట్రేషన్లుతో సమస్య

బేతుపల్లి రెవెన్యూలో గంగారం, పాకలగూడెం, నారాయణపురం, రామానగరం, కిష్టాపురం, తుంబూరు గ్రామాలకు చెందిన రైతులతో పాటు ఏపీలోని ఏలూరు జిల్లాకు చెందిన రైతులకు 133 సర్వేనెం.లో భూములు ఉన్నాయి. 300 మంది రైతుల వరకూ భూమి సాగులో ఉన్నా టైటిల్ లేదు. కాని సమీపంలో ఉన్న అసైన్‌మెంట్ భూములు నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేసిన పలువురు రైతులు పక్కనే పట్టా భూమి అయిన 133 నెంబర్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇలాంటి వారికి భూమి అసైన్‌మెంట్ కాగా టైటిల్ మాత్రం 133 సర్వే నెంబర్‌లో పొందారు.

తాజాగా సర్వేకు ఆదేశం

133 సర్వేనెంబర్‌లో సమస్య పూర్తి స్థాయిలో పరిష్కారం కాకపోవటంతో మళ్లీ ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఎనిమిది మంది సర్వేయర్ల బృందం శుక్రవారం సదరు సర్వే నెంబర్‌కు సంబంధించి సరిహద్దులు సరి చూసుకున్నారు సోమవారం నుంచి పూర్తి స్థాయి ఎంజాయ్‌మెంట్ సర్వే జరిగే అవకాశం ఉంది. మొత్తం భూమిలో ఎవరెవరు స్వాధీనంలో ఉన్నారు. వారికి ఆ భూమి ఎప్పుడు ఎలా సంక్రమించింది. వారి వద్ద ఉన్న కాగితాల ప్రకారం ఎంత విస్తీర్ణం ఉంది. పొజిషన్‌లో ఎంత విస్తీర్ణంలో ఉన్నారనేది ఖచ్చితంగా లెక్క తేల్చేందుకు జిల్లా అధికారులు అదేశించారు. ఇందులో భాగంగా భూ యజమానుల వద్ద ఉన్న లింకు డాక్యుమెంట్లను కూడా పరిశీలించనున్నారు. పూర్తి ఎంజాయ్‌మెంట్ సర్వే అనంతరం సాగులో ఉండి అన్ని లింకు డాక్యుమెంట్లు సరిగా ఉన్న భూ యజమానుల పేర్లను నమోదు చేసి వారికి పాస్ పుస్తకాలు ఇవ్వనున్నారు.

878/938 నెంబర్ కూడా సర్వే

బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని 878/938 సర్వే నెంబర్‌లో కూడా ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించనున్నారు. ఈ సర్వే నెంబర్‌లో 2027 ఎకరాల 13గుంటల భూమి ఉంది. ఈ నెంబర్‌లో కూడా అర్హులైన యజమానులకు హక్కులు లేవు. కాని అనర్హులకు హక్కులు కల్పించటంతో సమస్యలు నెలకొన్నాయి. దీంతో 878/938తో పాటు 148 సర్వే నెంబర్లను కూడా సర్వే చేయించేందుకు ఆదేశించారు.

ఘనంగా 'భగినీహస్త భోజనం'

- వివాహమైన అక్కా చెల్లెమ్మల ఇళ్లకు చేరుకున్న అన్నదమ్ములు
- సంప్రదాయబద్ధంగా తోబుట్టువుల వేడుక

అశ్వారావుపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీక శుద్ధ విదియ సోదరసోదరీ మణులకు పెద్ద పండుగ. ఐదురోజుల పాటు జరిగే దీపావళి పండుగ వేడుకల్లో భాగంగా విదియ రోజున దేశవ్యాప్తంగా జరుపుకొనే అత్యంత పవిత్రమైన, సోదరీసోదరుల బంధాన్ని తెలియజేసే పండుగ 'భగినీ హస్త భోజనం'. వివాహమై మెట్టింటికి వెళ్లిన సోదరి వద్దకు సోదరుడు వెళ్లి ఆమె చేతివంట భోజనం చేసి, ఆమెను సుఖసంతోషాలతో, సౌభాగ్యవతిగా ఉండమని దీవించే అత్యంత పవిత్రమైన వేడుక ఇది. దేశవ్యాప్తంగా జరుపుకొనే ఈ పండుగను తెలుగునాట భగినీహస్త భోజనంగా చెపుతారు. సోదరి చేతి వంట భోజనం చేయడం ద్వారా సోదరునికి అపమృత్యుభయాలు తొలగిపోతాయని నమ్మకం. అందుకే సోదరి ఎంత దూరంలో ఉన్న సోదరులు ఆమె మెట్టింటికి వచ్చి ఆమె చేతి వంటను భోజనం చేస్తారు. ఆదివారం కార్తీక శుద్ధ విదియ కావడంతో ఈ ప్రాంతంలో ఉంటున్న సోదరీ మణుల ఇళ్లకు వారి సోదరులు తరలివచ్చారు. ఇక్కడ ఉన్న సోదరులు వారి అక్కా, చెల్లెమ్మల ఇళ్లకు తరలివెళ్లారు. పుట్టింటినుంచి సోదరులు రావడంతో సందడి నెలకొంది.

భగినీహస్త భోజనానికి ఓ పురాణ చరిత్ర ఉంది. మార్కేండుయుని ప్రాణాలను తీసుకెళ్లే క్రమంలో శివుడి ఆగ్రహానికి యముడు గురవుతాడు. యముడిపై శివదేవుడు త్రిశూలాన్ని ప్రయోగిస్తారు. ఆయన దానినుండి తప్పించుకునేందుకు తన సోదరి అయిన యమున ఇంట్లోకి వెళతాడు. అక్కడ ఆమె తన సోదరుడు వచ్చాడని పంచభక్ష పరమాన్నాలు చేసి భోజనం వడ్డిస్తుంది. ఆ సమయంలో వారి మధ్య కనిపించిన ప్రేమానురాగాలను చూసిన శివుడు త్రిశూలాన్ని వెనక్కి తీసుకొని 'నీకేమి కావాలో కోరుకోమని' యమునను అడుగుతాడు. ఆమె ప్రతి కార్తీక శుద్ధ విదియరోజున సోదరి చేతిలో భోజనం చేసిన సోదరునికి అపమృత్యుదోషం తొలగాలని, ఆయన ఆశీర్వదాన్ని పొందిన సోదరికి సౌభాగ్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటుంది. ఆమె కోరిక మేరకు అప్పటి నుండి ఈ వేడుక అత్యంత వైభవంగా ప్రజలు జరుపుకొంటారనేది పురాణ కథ. ఇందులో భాగంగా ఆదివారం మండలంలోని ప్రతీ ఇంట్లో సోదరీసోదరుల కలయికతో ఆనందోత్సాహాలతో నిండిపోయింది.


సోదరుడికి భోజనం పెట్టి పసుపు కుంకుమ స్వీకరిస్తున్న సోదరి

ఉద్యోగులకు అండగా ఉంటాం

(5వ పేజీ తరువాయి)

పరిష్కారానికి కృషిచేస్తామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. వన సమారాధనలో ఆయన మాట్లాడుతూ తమ ప్రజా ప్రభుత్వం ఉద్యోగుల పక్షమేనన్నారు. ప్రస్తుతం కొంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నా ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగుల సమస్యలన్నింటినీ పరిష్కరించడానికి సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగుల సమస్యలపై ప్రత్యక్షంగా చర్చించి గత ప్రభుత్వం మిగిల్చిన బకాయిలను కూడా దశలవారీగా ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. ప్రతీ ఉద్యోగి సంయమనం పాటిస్తే వచ్చే జనవరి నాటికి సమస్యలన్నీ పరిష్కారమవుతాయన్నారు.


రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న జేఏసీ సెక్రటరీ శ్రీనివాసరావు

ఉద్యోగులకు అండగా ఉంటాం

ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు ఐక్యత ప్రదర్శించినపుడే న్యాయం జరుగుతుందన్నారు. నిరంతరం వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

మారం జగదీశ్వర్, జేఏసీ అధ్యక్షుడు



సకల ఉద్యోగుల వేతనంలో భాగమైన డీఏలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ కోరారు. వనసమారాధనలో ఆయన మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో 1969లో తెలంగాణ ఉద్యమాన్ని నాటి టీఎన్జీవో తాలూకా అధ్యక్షుడు బీఎల్ నర్సింహారావు పాల్వంచ నుంచి, ఇల్లెందులో రామరాజు, రాళ్ల సుధాకర్ రాజు తెలంగాణ ఉద్యమాన్ని ఉధ్రూతలూగించారన్నారు. ఆ నాయకుల స్ఫూర్తి తోనే నేడు ఖమ్మం జిల్లా నుంచి సకల ఉద్యోగులను ఐక్యం చేయాలన్న లక్ష్యంతో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అన్ని వర్గాలను ఐక్యం చేసి ప్రభుత్వం దృష్టి సమస్యలను తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఇటీవలె రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సంఘాలతో నాలుగు గంటల పాటు చర్చించామని 400 లకు పైగా ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. వీటిలో ఒక డీఏను విడుదల చేయడం హర్షనీయమన్నారు. మరో రెండు నెలల్లో ఉద్యోగుల అన్ని సమస్యలను సాధించడానికి ప్రభుత్వం కృషిచేస్తుందన్న నమ్మకం ఉందన్నారు.

గత సర్కార్ ఉద్యోగుల గొంతు నొక్కేసింది

ఏలూరి శ్రీనివాసరావు, జేఏసీ సెక్రటరీ



గత ప్రభుత్వం ఉద్యోగుల గొంతుకను నొక్కేసి వారికి రావాల్సిన రాయితీలను అడ్డుకుందని ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర సెక్రటరీ ఏలూరి శ్రీనివాసరావు విమర్శించారు. వనసమారాధనలో అధ్యక్ష ఉపన్యాసం చేసిన ఆయన రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రస్తావించారు. నాటి ప్రభుత్వంలో డీఏలను, పీఆర్సీని ఇవ్వకుండా తాత్సారం చేసిందన్నారు. వీటిపై ప్రశ్నిస్తే ఉద్యోగులపై కేసులు బనాయించి అడ్డుకుందన్నారు. పదేళ్ల పాటు ఆర్థిక విధ్వంసాన్ని సృష్టించిన గత ప్రభుత్వాన్ని ఉద్యోగులు కూకటి వేళ్లతో పెకిలించారన్నారు. ఉద్యోగులకు ఇచ్చిన వాగ్దానం మేరకు సీఎం రేవంత్‌రెడ్డి డీఏను విడుదల చేశారని, దీనికి ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయన్నారు.

కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, అడిషనల్ కలెక్టర్ రెవిన్యూ పి శ్రీనివాస రెడ్డి, మేయర్ పునకొల్లు నీరజ, ఇరిగేషన్ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, రాష్ట గిడ్డంగుల చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ డి వెంకటేశ్వర రావు, చైర్మన్ రాష్ట్ర హస్తకళలు అభివృద్ధి కార్పొరేషన్ నాయుడు సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ దేవరకొండ సైదులు, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షులు హర్ష వర్ధన్ రెడ్డి, నాగిరెడ్డి, జిల్లా నాయకులు కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రి , గుంటుపల్లి శ్రీనివాసరావు , జడ్ ఎస్ జయపాల్, అమరనేని రామారవు,నడింపల్లి వెంకటపతిరాజు, మల్లెల రవీంద్రప్రసాద్, కొమరగిరి దుర్గాప్రసాద్, పెద్దినేని రాధాకృష్ణ, గంగవరపు బాలకృష్ణ, మహిళా నాయకులు లలిత కుమారి, సుమమాలిని, ప్రమీల సాయి భార్గవ్ చైతన్య, ఉపాధ్యాయ సంఘ నాయకులు వై వెంకటేశ్వర్లు విజయ్ అదనపు కలెక్టర్ పి శ్రీనివాసరెడ్డి, పీఆర్‌టీయూ, యూటీఎఫ్, టీఎన్జీవో, టీజీవో జేఏసీ రాష్ట్ర జిల్లా నాయకులు హాజరయ్యారు ఖమ్మంజిల్లా ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంఓ జరిగిన వనసమారాధనకు అన్నిశఖల ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఉత్సాహంగా వనసమారాధన

చెరుకూరివారి తోటలో నిర్వహించిన సకల ఉద్యోగ ఆత్మీయ సమ్మేళనం, వనసమారాధన ఉల్లాసంగా ఉత్సాహంగా సాగింది. టీజీఈ జేఏసీ రాష్ట్ర సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో న నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉద్యోగల సంఘాల రాష్ట్ర ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర మంత్రులు, తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఉద్యోగుల కటుంబాలను అలరించాయి. కార్యక్రమానికి విచ్చేసిన అందరికీ ప్రత్యేక విందు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గుంటుపల్లి శ్రీనివాస్, తాళ్లూరి శ్రీకాంత్, కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రి, జడ్‌ఎస్ జయపాల్, దేవరపల్లి సైదులు, నడింపల్లి వెంకటపతిరాజు, మల్లెల రవీంద్రప్రసాద్,కొమరగిరి దుర్గాప్రసాద్, పెద్దినేని రాధాకృష్ణ, గంగవరపు బాలకృష్ణ, మహిళా నాయకులు లలిత కుమారి, సుమమాలిని, ప్రమీల తదితరులు ఏర్పాట్లు పరిశీలించారు. పోలీసుశాఖ ట్రాఫిక్ బందోబస్తు నిర్వహించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉద్యోగుల వనసమారాధన సాగింది.

సంకల్ప బలంతో ఏదైనా సాధ్యమే

మంత్రి తుమ్మల


ఎస్‌వీ నారాయణ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మం(ఆంధ్రజ్యోతిప్రతినిధి)/ఖమ్మం రూరల్(ఆంధ్రజ్యోతి), నవంబరు 3: సమాజంలో నమ్మకమైన వ్యక్తి సంకల్ప బలంతో ఏ పని తలపెట్టినా సమాజం అండగా ఉండి ముందుకు నడిపిస్తుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలోని గురుదక్షిణ ఫౌండేషన్ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గురుదక్షిణ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే, ఖమ్మం జడ్పీ మాజీ చైర్మన్ దివంగత చేకూరి కాశయ్య రిటైర్డ్ ఉపాధ్యాయుడు దివంగత ఎస్‌వీ నారాయణ విగ్రహాలను మంత్రి తుమ్మల, ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు. గురుదక్షిణ ఫౌండేషన్ వ్యవస్థాపకుల్లో ఒకరైన దుగ్గినేని సత్యనారాయణరావు తదితరుల ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్ర హయాంలో ఖమ్మంలో గురుదక్షిణ ఫౌండేషన్ ఏర్పాటుకు దివంగత నేతలు చేకూరికాశయ్య, ఎస్‌వీ నారాయణ తదితరులు తన వద్దకు రావడంతో అప్పటి ప్రభుత్వంతో మాట్లాడి 25 ఎకరాల భూమి కేటాయించినట్లు తెలిపారు. గురుదక్షిణ ఫౌండేషన్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణతో పాటు కుట్టుశిక్షణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. ఖమ్మంజిల్లా నుంచి దేశ, విదేశాల్లో ఉన్న ప్రముఖులు, ఎన్‌ఆర్‌ఐల సహకారంతో గురుదక్షిణ ఫౌండేషన్ లక్ష్యానికి అనుగుణంగా అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానన్నారు. ఇక్కడ వృద్ధులకు అన్ని విదాల సౌకర్యాలుండే ఆశ్రమం నెలకొల్పాలన్నారు. ప్రస్తుత సమాజంలో ఉద్యోగాల కోసం పిల్లలు విదేశాల్లో ఉంటున్న తరుణంలో వృద్ధులతో మాట్లాడేవారే కరువవుతున్నారన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఇళ్లల్లో మనుషులు ఉండే పరిస్థితి లేనందున ఈ మార్పులకు అనుగుణంగా వృద్ధాశ్రమాలను అభివృద్ధి చేయాలన్నారు. గురుదక్షిణ ఫౌండేషన్‌ను సుక్షేత్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, గురుదక్షిణ ఫౌండేషన్ చైర్మన్ గంగవరపు శంకరయ్య, సెక్రటరి సీహెచ్ సత్యనారాయణ ప్రసాద్‌లు గురుదక్షిణ ఫౌండేషన్ కార్యక్రమాలను వివరించారు.

ఈ సందర్భంగా ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే కూనంనేని డిజిటల్ లైబరీ కుట్టుమిషన్ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సీపీఐ రాష్ట నాయులు బాగం హేమంతరావు, పోటు ప్రసాద్, మాస్‌లైన్ నాయకుడు గుర్రం అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కేయూ అథ్లెటిక్స్ పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న కాకతీయ యూనివర్శిటీ పరిధి అంతర కళాశాలల అథ్లెటిక్స్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో పురుషుల విభాగంలో ఓవరాల్ చాంపియన్‌గా ఖమ్మం నగరంలోని కవితా మెమోరియల్ డిగ్రీ కళాశాల జట్టు నిలవగా, మహిళల విభాగంలో ఓవరాల్ చాంపియన్‌గా కొత్తగూడెం సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల జట్టు నిలిచింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో విద్యార్థులకు 100, 200, 400, 4ఇంటూ 800, 1,500, 5,000, 10,000మీటర్ల విభాగాల్లో పరుగు పందేలాలతో పాటు డిస్కస్‌త్రో, షాట్‌పుట్, లాంగ్‌జంప్, ట్రిపుల్‌జంప్, జావెలిన్‌త్రో, హ్యామ్మర్‌త్రో విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో కాకతీయ యూనివర్శిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రెటరీ ప్రొఫెసర్ వెంకయ్య, డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. రవికుమార్, ఫిజికల్ డైరెక్టర్ బి, వెంకన్న, టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రీనివాసరావు, అధ్యాపకులు కోటీ, ఏటీబీటీ. ప్రసాద్, ఎ. వీరన్న, వెంకట్, అమర్నాథ్, అథ్లెటిక్స్ అకాడమీ కోచ్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి ఉట్నూరులో రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు

పాల్వంచ రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిన్నెరసాని గిరిజన క్రీడల ఆశ్రమ పాఠశాలలో ఉమ్మడి జిల్లాలోని క్రీడాకారులకు ఏర్పాటు చేసిన శిక్షణ ఆదివారంతో ముగిసింది. ఈ నెల 5వ తేదీ ఉట్నూరులో జరిగే రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి 248మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. ఐటీడీఏ పీవో రాహుల్, పీడీ మణెమ్మల నేతృత్వంలో ఆరు రోజులపాటు కిన్నెరసానిలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, ఆర్చరీ, అథ్లెటిక్స్, చెస్, క్యారమ్స్, టెన్నికాయిట్ పోటీల్లో పీడీ, పీఈటీలు తగు శిక్షణ ఇచ్చారు.రెండు జిల్లాల్లో నుంచి గిరిజన విద్యాలయాల్లో చదువుతు క్రీడలపై ప్రతిభను చూపించిన క్రీడాకారులను ఎంపిక చేసి ఇక్కడ తగు తర్ఫీదు ఇచ్చారు. ఉట్నూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారులను సిద్ధం చేశారు.

మెడల్స్ సాధిస్తాం.. ఉట్నూరులో జరిగే రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు మెరుగైన మెడల్స్ సాధిస్తారని పీడీ మణెమ్మ చెప్పారు. జిల్లా ప్రతిష్టను రాష్ట్రస్థాయిలో చాటుతారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి పి. వెంకట నారాయణ, కోచ్‌లు సుబ్రహ్మణ్యం, మారెప్ప పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

క్రైం సమాచారం

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

నేలకొండపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో మంటల్లో కాలి వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చెన్నారం గ్రామంలో ఆదివారం తెల్లవారుఝామున జరిగింది. వివరాల ప్రకారం పగడాల నాగయ్య (70) చెన్నారంలోని పొండవచెలకలో ఒంటరిగా ఉంటున్నాడు. అతనికి ఎవరూ లేరు. మృతుడి భార్య, కుమారుడు గతంలోనే మృతిచెందారు. వృద్ధాప్య పింఛన్‌తోనే జీవితాన్ని వెళ్లదీస్తున్నాడు. కోడలు గ్రామంలోనే వేరే ఉంటుంది. ఎలా జరిగిందో.. ఏమో.. తెల్లవారుఝామున మంటల్లో కాలి నాగయ్య మృతి చెందాడు. మృతదేహాన్ని మంచంపై పూర్తిగా కాలిన స్థితిలో కనగొన్నారు. ఆదివారం చుట్టుపక్కల వారు చూసి పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వార్డు ఆఫీసర్..


సైదులు (ఫైల్)

వైరా/బోనకల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ వైరా మునిసిపాలిటీలో నాల్గో వార్డు ఆఫీసర్ షేక్.సైదులు(49) శనివారం అర్ధరాత్రి ఒకటిన్నర గంటల సమయంలో మృతిచెందారు. బోనకల్ మండలంలోని రావినూతల గ్రామానికి చెందిన సైదులు వీఆర్వో వ్యవస్థ రద్దయిన తర్వాత వైరా మునిసిపల్ వార్డు ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టారు. గత నెల 26న విధులు ముగించుకొని బాగా పొద్దుపోయిన తర్వాత ద్విచక్రవాహనంపై వైరా నుంచి రావినూతల వెళ్తుండగా మండలంలోని రెబ్బవరం వద్ద రాత్రి 11.45గంటల సమయంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. తలకు ఇతర అవయవాలకు బలమైన గాయాలు కావడంతో కోమాలోకి వెళ్లిపోయారు. వెంటనే సైదులును ఖమ్మంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స చేసినా ఫలితం దక్కలేదు. శనివారం రాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులున్నారు. రావినూతలలో సైదులు మృతదేహానికి వైరా మునిసిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ సూతకాని జైపాల్, ముళ్లపాటి సీతరాములు, కమిషనర్ చింతా వేణు, మునిసిపల్, రెవెన్యూశాఖలకు చెందిన సిబ్బంది సందర్శించి నివాళులర్పించారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురు ఆత్మహత్య

ఇల్లెందు/దమ్మపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు మండలంలో ఆదివారం వేర్వేరు ఘటనల్లో ఇరువురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం బాలాజీ నగర్ ఏరియాలో నివసించే సింగరేణి కార్మికుడి కుమార్తె దేవల్ల ఉదయశ్రీ (19) మంగళవారం క్రిమి సంహారక మందు సేవించింది. కుటుంబ సభ్యులు ఖమ్మంలో అయిదు రోజులుగా వైద్య చికిత్సలు అందించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యంలో శనివారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు.

మరో ఘటనలో స్టేషన్‌బస్తీలో నివసించే యాకూబ్ పాషా (30) తన నివాస గృహంలో ఉరి వేసుకుని చనిపోయినట్టు పోలీసులు తెలిపారు. నాలుగు రోజుల క్రితం మృతుని సోదరుడు మృతి చెందారు.. తీవ్ర ఆవేదనకు గురి అయి ఉరి వేసుకుని చనిపోయినట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీస్ సీఐ సత్యనారాయణ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పురుగుల మందు తాగి యువకుడు

దమ్మపేట (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గంగులగూడెం గ్రామంలో జరిగింది. ఈఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. ములకలపల్లి మండలం చవిటిగూడెం గ్రామానికి చెందిన సోడెం అనిల్ కుమార్ (18) కొంతకాలంగా దురదపాడు గ్రామంలో బంధువుల ఇంటి వద్ద వుంటున్నాడు. అనిల్‌కుమార్ మద్యానికి బానిసైయ్యాడని తెలుసుకున్న తల్లి జ్యోతి శనివారం అతడిని మందలించింది. దీంతో అతడు గంగులగూడెంలో బంధువుల ఇంటికి వెళ్ళి మద్యం మత్తులో పురుగులమందు తాగాడు . ఇదిగమనించిన బంధువులు సత్తుపల్లి వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి తల్లి జ్యోతి పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేయగా అదనపు ఎస్‌ఐ బాలస్వామి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

అప్పుల బాధతో అటెండర్..

దమ్మపేట,(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మందలపల్లి బస్టాండు వద్ద జరగగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అశ్వారావుపేట గ్రామానికి చెందిన ఉబ్బనపల్లి నాగేశ్వరరావు (42) సత్తుపల్లిలో నీటిపారుదల శాఖలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 1న మందలపల్లి బస్టాండులో పురుగుల మందు తాగి ఆత్మహ త్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన స్థానికులు బాధితుడిని సత్తుపల్లి వైద్యశాలకు తరిలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాదు తర లించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుని భార్య రేణుక ఫిర్యా దు మేరకు దమ్మపేట అదనపు ఎస్‌ఐ బాలస్వామి ఆదివారం కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. మృతుడు నాగేశ్వరరావు పిల్లల చదువుల కోసం అప్పుల చేసి వాటిని తీర్చలేక బలవన్మారణానానికి పాల్పడినట్లు తెలిసింది.

మొద్దులమాడలో ఇల్లు దగ్ధం

పసిబిడ్డకు తృటిలో తప్పిన ప్రమాదం

మంటల్లో కాలిన మూడు మేకలు


దగ్ధమవుతున్న ఇల్లు

అశ్వారావుపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట మండలంలోని మారుమూల గ్రామం మొద్దులమాడలో ఆదివారం మధ్యాహ్న సమయంలో కాకా వీరయ్యకు చెందిన తాటాకు ఇల్లు దగ్ధమైంది. వీరయ్య దంపతులు పొలం పనులకు ఉదయమే ఇంటి నుంచి బైటకు వెళ్లారు. బాలింత అయిన ఆమె కుమార్తె కనకదుర్గ మూడు నెలల పసిపిల్లను చూసుకుంటూ ఇంటివద్దే ఉంది. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో బిడ్డ నిద్రించి కదా అని పక్క ఇంటికి వెళ్లింది. కొద్ది సేపటిలోనే ఆ ఇంట్లో నుంచి ఆకస్మాత్తుగ పొగలు వస్తుండటంతో పరిసరాల్లోని ప్రజలు అరుపులు కేకలు పెట్టారు. దీనిని గమనించిన కనకదుర్గ ఇంట్లో తన బిడ్డ ఉందని కేకలు వేయడంతో ఓ వ్యక్తి కాలుతున్న ఇంట్లోకి ప్రవేశించి పసిబిడ్డను బైటకు తీసుకొచ్చాడు. బిడ్డకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఎవరూ లేని సమయంలో ప్రమాదం జరగటంతో ఇంట్లోని దుస్తులు, సామగ్రి, టీవీ, ధాన్యం పూర్తిగ దగ్ధం అయ్యింది. ఇంటి పక్కనే కట్టివేసి వున్న మూడు మేకలు మంటల్లో పూర్తిగ కాలిపోయాయి. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు మంటలను అదుపులోకి తెచ్చారు. దగ్ధమతున్న ఇంట్లో పసిబిడ్డ ఉండిపోవడంతో కొద్ది సేప ఆప్రాంతంలో తీవ్ర ఆందోళన కనిపించింది.

షాట్ సర్క్యూట్‌తో..

దుమ్ముగూడెం (ఆంధ్రజ్యోతి): పాతనారాయణరావుపేటలో ఆదివారం కూరం ముత్తయ్య ఇల్లు విద్యుత్‌ఘాతం కారణంగా దగ్ధమైంది. ఇంట్లో ఉన్న ధాన్యం, నగదు, బంగారం, గృహోపకరణాలు, సర్టిఫికెట్లు కాలిబూడిదయ్యా యి. ప్రమాద సమయంలో బాధిత కుటుంబ సభ్యులంతా పొలం పనుల్లో ఉన్నారు. గ్యాస్ సిలిండర్ పేలడంతో పరిసరాల ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. నష్టం రూ.4లక్షల వరకుంటుందని బాధితులు తెలిపారు.

శివాయిగూడెంలో..

రఘునాథపాలెం,(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదంలో నివాసం దగ్ధమైన సంఘటన చోటు చేసుకొంది. శివాయిగూడెంలో గుగులోత్ తులసితో పాటుగా మరో ఇద్దరు కుటుంబ సభ్యులు ఒకే నివాసంలో ఉంటున్నారు. ఆదివారం మధ్యాహ్న సమయంలో తులిసి నివాసానికి అగ్ని ప్రమాదం సంబవించటంతో రూ.1.5 లక్షల విలువైన ఇంట్లోని సామాన్లు అగ్నికి ఆహుతైనాయి. తనకు ప్రభుత్వం న్యాయం చేయాలని బాధితురాలు వాపోయారు.

మద్యం మత్తులో వ్యక్తి వీరంగం


పోలీసుల అదుపులో ఉన్న నింధితుడు

సత్తుపల్లిరూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఫూటుగా మద్యం సేవించిన ఓ వ్యక్తి వీరంగం సృష్టించిన సంఘటన ఆదివారం రాత్రి ఎన్టీఆర్ నగర్‌లో కలకలం రేపింది. ఎటువంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా ఉండే కాలనీలో అన్ని వీధులు తిరుగుతూ మహిళలు, చిన్నారులతో అసభ్యంగా ప్రవరిస్తున్న వ్యక్తిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఇళ్లలోకి చొరబడుతూ నానాదుర్భషలాడటం, భయభ్రాంతులకు గురిచేశాడంటూ స్థానికులు చెప్పారు. కాగా కాలనీకి చెందిన వ్యక్తి 100నంబర్ ద్వారా సమాచారం ఇవ్వగా కానిస్టేబుల్ ఒకరు సంఘటనా స్థలానికి చేరుకుని సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. సదరు వ్యక్తి మండలంలోని గౌరిగూడేనికి చెందిన వ్యక్తి అని, అప్పుడప్పుడూ ఇలా మతిస్థిమితం లేనట్లుగా ప్రవర్తిస్తూ వచ్చేపోయే వారితో అసభ్యంగా ప్రవర్తిస్తుంటాడని స్థానికులు తెలిపారు.

క్రీడాకారులకు గెలవాలనే ఆకాంక్ష ఉండాలి

- భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్
- కొత్తగూడెంలో ప్రారంభమైన రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నీ పోటీలు
- టీం ఛాంపియన్ షిప్‌లో కాంస్యం సాధించిన ఉమ్మడి ఖమ్మం జట్టు



మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ జితేష్ వీ పాటిల్

చుంచుపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు గెలవాలనే ఆకాంక్ష ఉండాలని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఆదివారం భద్రాద్రి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరగనున్న అండర్-17 బాల, బాలికల రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నీస్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆనంద ఖనిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రారంభమైన ఈ పోటీలకు ముఖ్య అతిథిగా కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు తాము ఎలాంటి పరిస్థితుల నుంచి ఎక్కడి నుంచి వచ్చాము అని కాకుండా, గెలవాలనే కాంక్ష ఎక్కువగా ఉండాలని సూచించారు. అప్పుడే విజయం సాధించగలరని ధీమా వ్యక్తం చేశారు. పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో సైతం పాల్గొనడం వలన జీవితంలో స్థిరపడవచ్చు అని పేర్కొన్నారు. జిల్లాలో క్రీడాభివృద్ధికి తన వంతుగా కృషి చేయాడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు. రాష్ట్ర స్థాయి పోటీల ఏర్పాటులో అన్నీ వసతులు కల్పించినందుకు నిర్వాహకులు అభినందించారు. ఇటీవలే ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు కొత్తగూడెం వేదికగా విజయవంతంగా నిర్వహించామని గుర్తు చేశారు. ఉమ్మడి పది జిల్లాలు నుంచి బాలురు - 70, బాలికలు - 70 మొత్తం 140 మంది హాజరైనారు. ఈ పోటీలను టీం ఛాంపియన్స్ అండ్ వ్యక్తిగత విభాగాలలో నాకౌట్ పద్ధతిలో నిర్వహించారు. 35 మంది జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల బృందం పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో డీఈవో ఎం.వెంకటేశ్వరచారి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నరేష్‌కుమార్, రాష్ట్ర పరిశీలకులు మామిడి సంతోష్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు బట్టు ప్రేమ్‌కుమార్, యనమదల వేణుగోపాల్, లక్ష్మయ్య, శేఖర్, స్టెల్లా , రాము, కవిత, సీతాదేవి, సుజాత, నాగలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా జట్టుకు కాంస్య పతకం

8వ రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్ -17 బాల, బాలికల టేబుల్ టెన్నీస్ పోటీలు ఆనంద్ ఖని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో జరిగాయి. తొలి రోజు టీం ఛాంపియన్ షిప్, వ్యక్తిగత అంశాల్లో ఈ పోటీలు నిర్వహించి తెలంగాణ రాష్ట్ర జట్టును ఎంపిక చేసి జాతీయ స్థాయి పోటీలకు పంపనున్నారు. ఈ పోటీలలో టీం ఛాంపియన్ షిప్ విభాగంలో ఆతిథ్య ఉమ్మడి ఖమ్మం జిల్లా బాలికల జట్టు తృతీయ స్థానం సాధించింది. బాలుర జట్టు సైతం అద్భుతమైన ప్రతిభ కనబరిచి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. మరో రెండు రోజులు సోమ, మంగళవారంలలో పోటీలు కొనసాగనున్నాయని నిర్వాహకులు తెలిపారు.



కాంస్యం సాధించిన ఉమ్మడి జిల్లా జట్టు

ఐదుగురు గ్రానైట్ సభ్యుల ప్రమాణస్వీకారం


రామూర్తిని సన్మానిస్తున్న గ్రానైట్ అసోసియేషన్ నాయకులు

ఖమ్మం ఖానాపురంహవేలి నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన గ్రానైట్ స్లాబ్ అసోషియేషన్ ఎన్నికల్లో ఎకగ్రీవంగా ఎన్నికైన ఐదుగురు కార్యవర్గ సభ్యులు ఆదివారం నగరంలోని అసోషియేషన్ కార్యాలయంలో ఎన్నికల అధికారి శ్రీనివాసరావు ప్రమాణస్వీకారం చేయించి ఎన్నికైనట్లు ధృవపత్రాలు అందించారు. స్లాబ్ అసోసియేషన్ ఉపాధ్యాక్షుడు1గా కొనగంచి శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ, జాయింట్ సెక్రటరీగా చావా రామూర్తి, ఈసీ మెంబర్ 2గా మావిలేటి అనిల్‌కుమార్, ఈసీ మెంబర్ 3గా బానోత్ లాల్‌ప్రతాప్ ఈసీ మెంబర్ 5గా బొల్లారెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో స్లాబ్ అసోషియేషన్ అధ్యక్షుడు పాటిబండ్ల యుగంధర్, ప్రధాన కార్యదర్శి కమర్తపు గోపాల్‌రావు, కోశాధికారి మారంరెడ్డి పరమేశ్వరరెడ్డి, టైల్స్ అసోషియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి తెడ్డు రమేష్, కోశాధికారి కృష్ణరెడ్డి, స్లాబ్ ఫ్యాక్టరీ యజమానులు వేముల రవికుమార్,చిత్తూరి నాగయ్య, టైల్స్ అసోసియేషన్ యజమానులు శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

చిట్టీ పేరుతో చీటింగ్

- నమ్మించి మోసం చేసిన మహిళ
- బాధితుల ఆరోపణ


మాట్లాడుతున్న బాధితులు

పాల్వంచ టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎంతో నమ్మకంగా ఇంట్లో కిరాయికి ఉన్న వారిని చిట్టీలు పెట్టి చిట్టీల పేరుతో కొందర్ని నమ్మించి తీసుకున్న అప్పులకు షూరిటీలు పెట్టించి ఓ మహిళ మోసం చేసిందని బాధితులు ఆరోపిస్తున్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో బాధితులు ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంట్రాక్టర్స్‌కాలనీలోని సదరు మహిళ ఇంట్లో ఏటూకూరు ఝూర్సీ, భర్త వేణు కిరాయికి ఉన్నామని, సదరు మహిళ చిట్టీలు కూడా నడపడంతో చిట్టీలు కట్టి రూ.5లక్షలు అప్పుగా ఇచ్చామని మొత్తం రూ. 20లక్షలు ఆమె మాకు ఇవ్వాల్సి ఉందని వాపోయారు. అదేవిధంగా రాహుల్ గాంధీనగర్‌కు చెందిన మరో బాధితుడు నుంచి రూ. 60లక్షలు తీసుకుని వాటిని తిరిగి ఇమ్మని అడగగా, ఎప్పటికప్పుడు వాయిదాలు పెట్టడం తప్ప తిరిగి ఇచ్చే పరిస్థితి కనపడటం లేదని వాపోయారు. ఆమె బాధితుల్లో తామేకాక ఇంకా ఎంతోమంది ఉండవచ్చునని అన్నారు. తాము కోర్టు నుంచి నోటీసులు ఇచ్చిన వెంటనే తమకు షూరిటీగా ఇచ్చిన ఆస్తిని రెండురోజుల్లోనే వేరే వ్యక్తికి బదలాయించిందని తెలిపారు. ఇంకా ఎందరో ఉన్న ఆమె బాధితులకు ఈ విషయం తెలియలనే తాము మిడియా ద్వారా ఈ విషయాలను తెలుపుతున్నామన్నారు. ఇంకెవ్వరు కూడా ఈ విధంగా తమలా మోసపోవద్దని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు, బాధితులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు

దుమ్ముగూడెం నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): డబ్ల్యూఎల్ రేగుబల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు తోటమళ్ల సంగీతరావు ఆదివారం సీతారాంపురం ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. స్కూటీపై ఇంటికి వెళ్తున్న సంగీతరావు వాహనాన్ని తూరుబాకకు చెందిన ముగ్గురు యువకులు తమ ద్విచక్రవాహనంతో బలంగా ఢీకొట్టారు. తీవ్ర గాయాలపాలైన సంగీతరావును చికిత్సల కోసం భద్రాచలం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

18నుంచి రాజ్య స్థరీయ బాల్ విజ్ఞానిక్ ప్రదర్శన

డీఈవో వెంకటేశ్వరాచారి


డీఈవో వెంకటేశ్వరాచారి

కొత్తగూడెంఅర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతిక, పర్యావరణ, ఆరోగ్యం పట్ల ఆసక్తి, అభిరుచి కల్పించేందుకు ప్రతి ఏడాది పాఠశాల స్థాయిలో సైన్స్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని డీఈఓ వెంకటేశ్వరచారి అన్నారు. నవంబరు, డిసెంబరు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వ పరిదిలో స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌సీఈఆర్టీ) హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో సైన్స్ పెయిర్‌ను రెండేళ్లుగా రాజ్య స్థరీయ బాల్ విజ్ఞానిక్ ప్రదర్శన(ఆర్‌బీవీపీ) ఫర్ చిల్డ్రన్స్ పేరుతో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రధాన అంశంగా సుస్థిర భవిష్యత్ కోసం శాస్త్ర సాంకేతిక రంగం ఉంటుందన్నారు. విద్యార్థులు ఏడు ఉప అంశాలపై తమ ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించాలన్నారు. సెమినార్ నిర్వహణలో మిల్లె ట్స్ ఫర్ సస్టెనబుల్ ఫ్యూచర్ హెల్త్ అంశంపై (టీఎల్ఎం) ఉపాధ్యాయులకు ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ నెల 18,19,20 తేదిల్లో సైన్స్ ఫెయిర్ నిర్వహణకు 18 మంది ఉపాధ్యాయులతో కమిటీలు ఏర్పాటు చే య ను న్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో 1700నుంచి 2000 మంది విద్యార్థులు పాల్గొని 500పైగా ఎగ్జిబిట్స్ ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలపై శాస్త్రవేత్తలతో ప్రసంగాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సైన్స్ ఫెయిర్‌లో ఐటీడీఏ పాఠశాలలకు ప్రత్యేకంగా పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో 14 జనరల్ క్యాటగిరీ, 7 ఐటీడీఏ, 1సెమినార్ విజేత, 2 టీచర్స్ ఎగ్జిబిట్‌తో కలిపి మొత్తం 24 క్యాటగిరిలో పోటీలు ఉంటాయన్నారు.

బాధిత కుటుంబాలకు నామా పరామర్శ

ఖమ్మంటౌన్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు ఆదివారం నగరంలోని 3,5 డివిజన్లలో పర్యటించారు. 3వ డివిజన్ కార్పొరేటర్ మలీదు జగన్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా, బల్లేపల్లిలోని జగన్ నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నామా నివాళులు అర్పించారు. 5వ డివిజన్ బాలాజీనగర్‌లో యల్లంపల్లి హనుమంతరావు నివాసానికి వెళ్లి, ఇటీవల మృతిచెందిన ఆయన మాతృమూర్తి వరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమాల్లో నల్లమల వెంకటేశ్వరరావు, లక్ష్మణ్, నర్సింహారావు,

కొనకంచి వరప్రసాద్, కాట్రాల శ్రీరాములు, బాణాల వేంకటేశ్వర్లు గొడ్డేటి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

తల్లాడ/భద్రాచలం నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం మల్లవరం గ్రామంలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆదివారం ఎంఆర్‌ఐ భాస్కర్ పట్టుకున్నారు. అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసిన శ్రీనివాసరావుపై 6ఏ కేసు నమోదు చేసినట్లు ఎంఆర్‌ఐ తెలిపారు.

భద్రాద్రిలో రెండు క్వింటాళ్లు..

భద్రాచలం (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని కొత్త కూరగాయల మార్కెట్ ప్రాంగణంలో ఉన్న ఓ రేషన్ దుకాణం నుంచి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా ఎస్పీ పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం సాయంత్రం రేషన్‌దుకాణం నుంచి ఆటోలో తరలిస్తుండగా పోలీసులు ముందస్తుగా అందిన సమాచారంతో పట్టుకున్నారు. రెండు క్వింటాళ్ల రేషన్ బియ్యంతోపాటు ఆటోను స్వాధీనంచేసుకోగా ఆటో డ్రైవర్‌ను సైతం అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఖమ్మంక్రైం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆదివారం ఖమ్మం నగర రైల్వేపోలీసుస్టేషన్ సమీపంలో జరిగింది. రైల్వేపోలీసుల కథనం ప్రకారం ఖమ్మం నుంచి మల్లెమడుగు వెళ్లే మార్గంలో సుమారు 35 ఏళ్ల వయస్సున్న గుర్తుతెలియని వ్యక్తి రైలునుంచి జారిపడి మృతిచెందాడు. రైల్వేసిబ్బంది ద్వారా తెలుసుకున్న పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం అన్నం శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురికి తరలించారు.

ఏట్లో కొట్టుకుపోయి పాడి గేదె మృతి

మధిరరూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పొలంలో మేతకు వెళ్లిన గేదె ఏటి ఉధృతికి కొట్టుకుపోయిన సంఘటన ఆదివారం మధిర మండలం చిలుకూరులో జరిగింది. తాళ్లూరు రాంబాబుకు చెందిన పాడిగేదె గ్రామసమీపంలోని ఏటి వద్ద పొలాల్లో మేతకు వెళ్లింది. మేత మేసిన అనంతరం నీటి కోసం గేదె ఏటిలో దిగగా చెక్‌డ్యాంలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో ఆ ఉధృతికి గేదె కొట్టుకుపోయి మృతిచెందింది. దీని విలున రూ.80వేలు ఉంటుందని రైతు తెలిపాడు.

భవిష్యత్ కమ్యూనిస్టులదే..

గాడి తప్పుతున్న కాంగ్రెస్ పాలన

ప్రజలు మరో పోరాటానికి సిద్ధం కావాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్



మాట్లాడుతున్న పోతినేని

ఖమ్మం రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): దేశంలో భవిష్యత్ కమ్యూనిస్టులదేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుధర్శన్ రావు అన్నారు. మండల పరిదిలోని గోళ్లపాడు గ్రామంలో సీపీఎం మండల 9వ మహసభ ఆదివారం నిర్వహించారు. బహిరంగ సభలో పోతినేని, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతు మండల ప్రాంతంలో పేద ప్రజలకు, అట్టడుగు వర్గాలకు, దళితులకు, గిరినులకు అండగా నిలిచింది ఎర్రజెండా మాత్రమేనన్నారు. దేశంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి రావడానికి చంద్రబాబు, నితీష్‌కుమారే కారణమని తెలిపారు. మతవిద్వేషాలు రెచ్చగొడుతు మోదీ అధికారం చేపడుతున్నాడని విమర్శించారు. మోదీ అధికారం చేపట్టిన 11ఏళ్లలో మైనార్టీలపై, దళితులపై దాడులు, అత్యాచారాలు పెరిగాయన్నారు. రైతు వ్యతిరేక నల్లచట్టాలు రద్దు చేయాలని సుమారు 390 రోజులు డిల్లీ సరిహద్దుల్లో మొహరించిన 400 ప్రజాసంఘలకు నాయకత్వం వహించింది సీపీఎం ఎంపీ హన్నన్ మొల్లా అని రైతు సంఘం నాయకుడు టికాయత్ స్వయంగా తెలిపారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ధర్నాచౌక్‌లు ఎత్తివేసిందని యూనియన్లు వద్దని చులకనగా మాట్లాడారని అధికారం కోల్పోయేనరికి ధర్నాలు, యూనియన్లు, పాదయాత్రలంటూ మొసలికన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకుల అహంకారంతోనే ఓటమి పాలైందని బీఆర్ఎస్ మీద వ్యతిరేకతతోనే ప్రజలు కాంగ్రెస్‌కు పట్టంకట్టారాన్నరు. కాంగ్రెస్ కూడా పచ్చి అబద్దాలు ఆడుతూ ప్రజలను మోసం చేస్తుందని విమర్శించారు. సీతారామ ప్రాజెక్టు పంపులు ప్రారంభించి ప్రాజెక్టు ప్రారంభించినట్లు పత్రికల్లో వార్తలు రాయించుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రపంచ దేశాలు కమ్యూనిస్టుల వైపు చూస్తున్నాయని అందులో భాగంగనే శ్రీలంకలో నూతనంగా కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వం ఏర్పడిందన్నారు. అనంతరం 33 మందితోకలిపి నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా ఏదులాపురం గ్రామానికి చెందిన ఊరడి సుదర్శన్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నంద్రా ప్రసాద్, సంజీవరెడ్డి, జక్కంపూడి కృష్ణ, కర్నాకర్ గౌడ్, రమేష్, కోటయ్య, బషీరుద్దీన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వారాంతపు సంతలో జవాన్లపై మావోయిస్టుల దాడి

ఇద్దరు పోలీసులకు గాయాలు..

ఆయుధాల అపహరణ

ఛత్తీస్‌గడ్‌లోని సుక్మా జిల్లాలో ఘటన

దుమ్ముగూడెం నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సరిహద్దు చత్తీస్‌ఘడ్ రాష్ట్రం సుక్మా జిల్లా జేగురుగొండ వారాంతపు సంతలో ఆదివారం పట్టపగలే ఇద్దరు పోలీస్ జవాన్లపై మావోయిస్టులు దాడికి తెగబడ్డారు. డీఆర్జీ జవాన్లు కర్తం దేవా, సోడి కన్నాలు సంతలో సెక్యూరిటీ విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో సాధారణ పౌరుల వేషధారణలో ఉన్న మావోయిస్టు స్మాల్ ఏక్షన్ టీం సభ్యులు పదునైన ఆయుధాలతో డీఆర్జీ జవాన్లపై దాడి చేసి వారి వద్ద ఉన్న ఆయుధాలను అపహరించారు.

దాడి అనంతరం సాధారణ పౌరులతో కలిసిపోయి దొరక్కుండా తప్పించుకున్నారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరు డీఆర్జీ జవాన్లను మెరుగైన చికిత్సల కోసం హెలికాప్టర్‌లో తరలించారు. దాడి చేసిన మావోయిస్టుల కోసం పోలీసు బలగాలు గాలింపు చేపట్టాయి.

సుక్మా జిల్లా ఎస్పీ కరణ్ చౌహాన్ దాడిని ధృవీకరించారు.



మున్నేరు వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ

ఖమ్మంక్రైం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మున్నేరు వరద బాధితులకు అభయ, దేవకి ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లు, చాపలు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దేవకి వాసుదేవరావు ఆదివారం పంపిణీ చేశారు. ఇప్పటి వరకు వరద బాధితులకు సుమారు రూ.70లక్షల సరుకులు పంపిణీ చేశామని చెప్పారు. గతంలో ఎన్నడులేని విధంగా ఖమ్మంలో వరద రావడానికి రాష్ట్ర ప్రభుత్వం తప్పుకూడా ఉందన్నారు. ఈకార్యక్రమంలో వనమా వేణుగోపాలరావు, చంద్రశేఖర్, జయంత్‌పటేల్, కేశవలాల్‌పటేల్, నకిరికంటి భద్రం లక్ష్మీనారాయణపాల్గొన్నారు.

ఆ డివిజన్ అభివృద్ధి ఆశాజనకం

- సక్రమంగా తాగునీరు
- అంతర్గత రహదారులు సైతం సీసీ రహదారులుగా నిర్మాణం
- కార్పొరేటర్ సహకారంతో అభివృద్ధి పథంలో 24వ డివిజన్

డివిజన్ విజిట్





డివిజన్‌లో నిర్మించిన సీసీ రహదారి, శాంతినగర్ ప్రభుత్వ కళాశాల

ఖమ్మంటౌన్,నవంబరు3(ఆంధ్రజ్యోతి): నగరంలోని 24వ డివిజన్‌లో సమస్యలు తక్కువగానే ఉన్నాయి. కార్పొరేటర్ నిధులు మంజూరు చేయించుకొని, అభివృద్ధి పనులు చేశారు. సీసీ రహదారులతో సహా పలు పనులు చేయగా, ముఖ్యంగా డివిజన్‌లోని శాంతినగర్ కళాశాల అభివృద్ధి చేయటంతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను వసతి, సౌకర్యాలతో అందించగలుగుతున్నారు. ఎక్కడా లేనివిధంగా ఈ డివిజన్‌లో ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేశారు.డ్రెయినేజీలపై మూతలు ఏర్పాటు చేయటంతో మురుగు కనపించదు.సదరు డ్రెయినేజీల మూతలపై వాహనాలు నడిపి ధ్వంసం చేయటంతో మూతల ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేశారు. డ్రెయినేజీలపై మూతలకు (మ్యాన్‌హోల్స్) ప్రతిపాదనలు తయారు చేయటమే కాకుండా అధికారులను తీసుకువచ్చి పరిస్థితిని వివరించారు. డివిజన్‌లో మొక్కలను పెంచటమే కాకుండా సంరక్షించినందుకు కార్పొరేటర్ కమర్తపు మురళికి హరితమిత్ర అవార్డు వచ్చింది.

డివిజన్ స్వరూపం

విస్తీర్ణం: సుమారు 3కిలోమీటర్లు

డివిజన్ ప్రాంతాలు:బోనకల్‌రోడ్, చాకలి బజార్, ఎస్పీ ఆఫీస్‌రోడ్, తాపీల సెంటర్, పార్శీబంధం, శాంతినగర్, సెయింట్ మేరీస్ పాఠశాల ప్రాంతం

డివిజన్‌జనాభా: 8వేలు, ఓటర్లు: 5800

డివిజన్‌లో సమస్యలివీ:

డివిజన్‌లోమురుగు కనబడకుండా మూతలు ఏర్పాటు చేసినప్పటికీ వాహనాలను నడపటంతో అవి ధ్వంసం అయ్యాయి. బోనకల్ క్రాస్ రోడ్ మీసేవా వద్ద రహదారులకు ప్యాచ్‌వర్క్ చేయించాల్సి ఉంది. ఆ ప్రాంతంలోని బావిని పూడికతీతకు ప్రతిపాదనలు తయారు చేశారు, చిన్నచిన్న సమస్యలు మాత్రమే నెలకొన్నాయి.

చేసిన అభివృద్ధి ఇదీ..

డివిజన్‌లో ఇప్పటివరకు సుమారు రూ.4కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ నిధులతో సీసీ రహదారులు, ఫుట్‌పాత్‌లు, డ్రెయినేజీ నిర్మాణాలు చేపట్టారు. కాగా సీఎం ఎస్యూరెన్స్ నిధులు రూ.4కోట్లతో డివిజన్‌లోని శాంతినగర్ కళాశాలను అభివృద్ధి చేశారు. అదనపు తరగతుల నిర్మాణం, మౌళిక వసతులు కల్పించారు. దీంతో డివిజన్‌లో శాంతినగర్ కళాశాలలో నాణ్యమైన విద్యను అందించగలుగుతున్నారు. మిషన్ భగీరథ ద్వారా సురక్షిత మంచి నీరు అందిస్తున్నారు. అంతర్గత రహదారులు సైతం సీసీ రహదారులుగా ఉండటంతో ప్రజలు, పాదాచారులు సౌకర్యవంతంగా ప్రయాణం చేయగలుగుతున్నారు.

చిన్నసమస్యలే ఉన్నాయి

కమర్తపు మురళి, కార్పొరేటర్



డివిజన్‌ను ఎంతో అభివృద్ధి చేశాం. చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాల్సి ఉంది. రహదారులు ప్యాచ్‌వర్క్‌లు, మ్యాన్‌హోల్స్‌పై మూతల ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేసి అధికారులకు అందించాం. రూ.15లక్షల నిధులకు అంచనాలు పంపాం. మంజూరు కాగానే పనులు పూర్తి చేస్తాం.

మౌళిక వసతులు కల్పించారు

సూరపనేని సురేష్



డివిజన్‌కు కార్పొరేటర్ నిధులు తెచ్చి అన్ని మౌళిక వసతులు కల్పించారు. సీసీ రహదారులు నిర్మించారు, తాగునీటికి ఇబ్బంది లేదు. కాగా చిన్న సమస్యలు ఉన్నా, అవి మేజర్ సమస్యలు కాదు. డివిజన్‌లో హరితహారం సక్రమంగా నిర్వర్తించటంతో అవార్డు సైతం వచ్చింది.

డ్రెయినేజీ సమస్యలేదు

రేఖా లక్ష్మణ్



డ్రెయినేజీలు నిర్మించటంతో పాటు వాటిపై మూతలు ఏర్పాటు చేశారు. మ్యాన్‌హోల్స్‌పై మూతలు ఉండటంతో మురుగు కనబడదు. ముఖ్యంగా ఏ డివిజన్‌ల్ లేని విధంగా ఈ డివిజన్‌లో రహదారి పక్కన ఫుట్‌పాత్‌లు ఉన్నాయి.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	46రూ.
వంకాయ	54
గుత్తి వంకాయ	60
బీరకాయ	38
పచ్చిమిర్చి	54
కాకరకాయ	44
బెండకాయ	34
పొట్లకాయ	60
దోసకాయ	48-70
గోరుచిక్కుడు	94
నాటుచిక్కుడు	140
క్యాబేజీ	34
దొండ	36-46
సొరకాయ	28
క్యారెట్	58
క్యాప్సికం	90
ఆలుగడ్డ	34
ఉల్లిగడ్డ	50-60
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	170
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	లక్కీభాస్కర్
శ్రీనివాస:	అమరన్
సాయిరాం:	బఘీర/సింగం
ఆదిత్య:	క
తిరుమల:	దేవర

పేరు ఎలా వచ్చిందంటే ?

గుంటుమల్లన్న



ఖమ్మంసాంస్కృతికం,నవంబరు3 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో 500 సంవత్సరాల కితం వెలసిన పురాతన గుంటు మల్లేశ్వరస్వామి దేవాలయం మహిమాన్విత ఆలయాల్లో ఒకటిగా భక్తుల నమ్మిక.. స్వయంభూగా వెలసిన ఈస్వామిని కొలిచి అర్చిస్తే కోరిన కోర్కెలు తీరతాయని విశ్వాసం కనుక తరతరాలుగా గుంటుమల్లేశ్వర స్వామి భక్తుల ఆదరణ పొందుతోంది. ఏడాది పొడవునా ఈ ఆలయంలో శివపూజలు నిత్యఅభిషేకాలు జరుగుతాయి. పూర్వం రెడ్డి రాజులు ఖమ్మం ఖిల్లాను పరిపాలించిన కాలంలో ఈ ప్రాంతంలో తవ్వకాలు జరుపుతున్నప్పుడు.. వడ్డెర పనివారు భూమిలో గడ్డపార దించగా గుండు రాయికి రక్తం కారింది. మరోసారి గడ్డపార దించగా మళ్లీ మరింత రక్తం కారటంతో ఆవెంటనే కళ్లు తిరిగి పడిపోయాడు. ఆ విషయం రాజుగారికి తెలియజేయగా రాజు ఆప్రాంతాన్ని సందర్శించారు. అది స్వామి మహిమ అని గుండు రాయికి పూజలు చేయాల్సిందిగా ఆదేశించారు. గుండు మల్లేశ్వరుడుగా పేరు పెట్టారు. కాలక్రమేణా అది గుంటు మల్లన్నగా రూపాంతరం చెంది ఉండవచ్చని అభిప్రాయపడుతున్నారు. 2001లో దేవాలయానికి పాలక మండలి ఏర్పాటు అనంతరం ఆలయాన్ని దఫాల వారీగా మరింత అభివృద్ధి చేశారు.

ఇల్లెందు ఏఎంసీ

డైరెక్టర్లుగా ఇద్దరు గిరిజనులు



గబ్రూ నాయక్, బాప్‌సింగ్ నాయక్

కామేపల్లి,నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా కామేపల్లి మండలానికి చెందిన ఇద్దరు గిరిజనులు గబ్రూ నాయక్, బాప్‌సింగ్‌లకు చోటు కల్పించారు. ఈ సందర్భంగా ఆదివారం ఇల్లెందులో ప్రమాణస్వీకారం చేశారు. కామేపల్లి మండలం లాల్యతండ గ్రామానికి చెందిన విద్యావేత్త, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గుగులోత్ గబ్రూ నాయక్, గోవింద్రాల గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త మాలోత్ బాప్‌సింగ్ నాయక్‌లను డైరెక్టర్లుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా గబ్రూ నాయక్, బాప్‌సింగ్‌లు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు, టీపీసీసీ రాష్ట్రప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. డీసీసీబి డైరెక్టర్ మేకల మల్లిబాబు, గింజల నర్సింహరెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య, జగన్నాథరెడ్డి, డీఎస్, రాంబాబు, ఆరెం రవి అభినందించారు.

బాబూరావుకు మంత్రుల నివాళి



బాబురావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొంగులేటి

ఖమ్మంరూరల్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపురం, పోలేపల్లి తదితర గ్రామాల్లో ఆదివారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ రఘురాంరెడ్డి పర్యటించారు. మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు బండి జగదీష్ మామ నాగండ్ల బాబురావు ఇటీవల మృతిచెందాడు. ఆయన దశదిన ఖర్మకు హాజరయ్యారు. బాబురావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, ఐడీసీ చైర్మన్ విజయ్‌బాబు, మార్కెట్ చైర్మన్ బైరు హరినాదబాబు, జిల్లా కాంగ్రెస్ నాయకురాలు మద్దినేని స్వర్ణకుమారి, తుళ్ళూరి బ్రహ్మయ్య, నాయకులు డాక్టర్ శివరామకృష్ణ, బండి జగదీష్, శివారెడ్డి, బెల్లంశ్రీను, కాకాని యశ్వంత్, మహేష్, సత్యం, భాస్కర్, భార్గవ్, రాజశేఖర్, మోతుకూరి కృష్ణ, దావూద్ పాల్గొన్నారు.

నేడు ఖమ్మంలో విద్యుత్ కోతల ప్రాంతాలు

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో ప్రధాన రహదారి ఇల్లెందు క్రాస్ రోడ్డులోని 33/11 సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్‌కోత విధించనున్నారు. ఉదయం 7గంటల నుంచి 11 వరకు విద్యుత్ కోతలు ఉంటాయని అధికారులు ప్రకటించారు. కవిరాజ్‌నగర్, వైరా రోడ్డు, న్యూ విజన్ పాఠశాల, కోర్టు ప్రాంతం, వీడియోస్ కాలనీ, బ్యాంకు కాలనీ, సహకారనగర్, గట్టయ్య సెంటర్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పాడుతుందని వినియోగదారులు సహకరించాలని విద్యుత్‌శాఖ అధికారులు కోరారు.

పలు కుటుంబాలకు సంబాని పరామర్శ

తిరుమలాయపాలెం,నవంబరు3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకుల కుటుబాలను మాజీమంత్రి సంబాని చంద్రశేఖర్ ఆదివారం పరామర్శించారు. మండలంలోని పాతర్లపాడు మాజీసర్పంచ్ లాలమ్మ, పడమటితండాకు చెందిన వ్యవసాయమార్కెట్ కమిటీ డైరెక్టర్ బానోతు హుస్సేన్‌నాయక్, జల్లేపల్లికి చెందిన రేఖా ముత్తయ్య ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బెల్లం శ్రీను, కరీం, వేముల ఉపేందర్, రంగశెట్టి కోటేశ్వరరావు, జనగం సంపత్‌రావు, ఉపేందర్, నజీర్, బానోతు శ్రీను, సురేష్ పాల్గొన్నారు.

బీసీ కమిషన్ ఎదుట వాదనలు వినిపిద్దాం

ఖమ్మంచర్చికాంపౌండ్,నవంబరు3 (ఆంధ్రజ్యోతి): బీసీ కమిషన్ ఎదుట బీసీల సమస్యలపై వాదనలు వినిపిద్దామని జాతీయ బీసీ సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణ వరపు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఖమ్మంలోని ఆ సంఘం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దశాబ్దాలుగా సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా ఉపాధి రాజకీయ రంగాల్లో బీసీవర్గాలకు అన్యాయం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని కమిషన్ ముందు వివరిస్తామని ఆయన పేర్కొన్నారు.

అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు

ఖమ్మం ఖానాపురంహవేలి నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్నం సేవాఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మూడు అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ మృతదేహాల కోసం ఎవ్వరు రానందున ఆసుపత్రి సిబ్బంది, పోలీసుల సమక్షంలో బల్లెపల్లి వైకుంఠథామంలో అన్నం శ్రీనివాసరావు అంత్యక్రియలు నిర్వహించారు.

వ్యవసాయ రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండ

మేయర్ పునుకొల్లు నీరజ



ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు అధికారంలో ఉన్నా వ్యవసాయ రంగానికి కొండంత అండగా నిలుస్తోందని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మం నగర ఎరువులు, పురుగు మందులు, విత్తన డీలర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన వన సమారాధనలో ఆమె పాల్గొన్నారు. రైతులకు మంచి వ్యవసాయ దిగుబడులు రావాలంటే విత్తన, ఎరువులు, పురుగు మందుల వ్యాపారులే కీలకమన్నారు. ఈ సందర్భంగాపునుకొల్లు నీరజ,రామాబ్రహ్మం దంపతులను సన్మానించారు.

అవగాహన కల్పనలోనూ చెత్తశుద్ధి

- రద్దీ రహదారులపై ముగ్గుతో పారిశుధ్య హెచ్చరిక బోర్డులు
- కొన్ని గంటలకే చెరిగిపోతున్న నోటీసులు
- అక్కడే పడేస్తున్న చెత్త కవర్లు



ముగ్గుతో రాసిన నోటీసు, మరుసటి రోజే ముగ్గు చెరిగి పోవటంతో అక్కడే పడేసిన చెత్త

ఖమ్మంసంక్షేమవిభాగం,నవంబరు4 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థ పారిశుధ్య పర్యవేక్షణ అధికారుల పనితీరు చూసిన నగర ప్రజలు ఔరా అనుకుంటున్నారు. చెత్త తొలగింపుపై అధికారులకు ఇంతటి చిత్తశుద్ధ ఉందా అని ఆశ్చర్యపోతున్నారు. రాష్ట్రంలోనే అత్యధిక ఆదాయ రాబడి మున్సిపాలిటీలో హైదరాబాద్, వరంగల్ తర్వాత స్థానం ఖమ్మం నగరానికి ఉంది. ఏటా ట్యాక్స్‌ల రూపంలో రూ.కోట్లు ఖాజాకు చేరుతాయి. అయితే ఖమ్మం నగరంలో పారిశుధ్య అవగాహన కార్యక్రమాల తీరుపై విమర్శలు వెలువడుతున్నాయి. పారిశుధ్య నగరంగా గ్రీన్‌సిటీగా ఖమ్మం నగరం గతంలో వరసగా అవార్డులను కైవసం చేసుకొంది. అయితే ఇటీవల కాలంలో నగరంలోని కొంతమంది నివాసాల వారు వ్యాపారులు తమ నివాసాల్లోని చెత్తను తీసుకొచ్చి ప్రధాన రహదారుల సెంటర్లలో పడేస్తున్నారు. అటువంటి వారిని కేఎంసీ అధికారులు గుర్తించి వారికి జరిమానా విధించారు. తద్వారా రహదారులపై చెత్త, ఇతర వ్యర్థాలను నియంత్రణ చేయవచ్చు. కానీ చెత్త వేసే ప్రాంతాల్లో పారిశుధ్య పర్యవేక్షణ అధికారులు కేవలం ముగ్గులతో రహదారులపై బోర్డులు రాస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో చెత్త వేస్తే రూ.500 జరిమాన విధిస్తామని ముగ్గుతో హెచ్చరిక బోర్డులు రాశారు. ప్రధాన రహదారులు కావటంతో వాహనాల వేగానికి వచ్చే గాలి, వాహనాలు తాకిడికి ముగ్గు బోర్డులు వేసిన కొద్ది గంటలకే బోర్డులు తొలిగిపోతున్నాయి. దీంతో యాథావిధిగా ఆదేప్రాంతంలో చెత్త, వ్యర్థాలను పడేస్తున్నారు. ముగ్గుతో హెచ్చరిక బోర్డులు రాయటం నీటిపై రాతలే అని నగర ప్రజలు కేఎంసీ అధికారుల పనితీరును ప్రశ్నిస్తున్నారు.

ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలి

తిరుమలాయపాలెం,నవంబరు3 (ఆంధ్రజ్యోతి): యువత స్వయం ఉపాధి అవకాశాలు సద్వినియోగించుకుని అభివృద్ధి చెందాలనిజిల్లా కాంగ్రెస్ నాయకులు తుంబూరు దయాకరరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పిండిప్రోలులో ఏర్పాటు చేసిన టీస్టాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ప్రభుత్వ పథకాలతో పాటు స్వయం ఉపాధి పథకాలను ఏర్పాటుచేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు చావా వివరామకృష్ణ, పోట్ల కిరణ్, యన్నం సుధాకర్‌రెడ్డి, మద్దులపల్లి ఏఎంసీ డైరెక్టర్ జడల నగేష్, పుసులూరి సురేష్, గురవయ్య, టి.కిరణ్, అబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రగ్బీ, అథ్లెటిక్స్ ఎంపిక

ఖమ్మంస్పోర్ట్స్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) అండర్- 14, 17 బాల, బాలికల రగ్బీ, అథ్లెటిక్స్ జట్లను సోమవారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఎంపిక చేయనున్నారు. ఈ వివరాలు ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ నర్సింహమూర్తి తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 10 గంటల కల్లా స్టేడియానికి చేరుకోవాలని సూచించారు.

కవి రమేష్‌కు పురస్కారం

ఖమ్మంఖానాపురంహవేలి నవంబరు3 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, కవి కె.రమేష్‌కు సాహితీ పెద్దలు విద్యాధర్, భగీరథ తదితరులు జాతీయ పురస్కారాన్ని అందించారు. ఆదివారం హైదరాబాద్‌లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పురస్కారాన్ని అందించారు.

శ్రీపాద శ్రీహరికి నివాళులు

తిరుమలాయపాలెం,నవంబరు3 (ఆంధ్రజ్యోతి): పేదల కోసం అసువుల బాసిన శ్రీపాద శ్రీహరి వర్ధంతిని ఆదివారం మండలంలోని రాజారంలో నిర్వహించారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, ప్రజాపంథా ఆధ్వర్యంలో వర్ధంతి నిర్వహించారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం



రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు

నేలకొండపల్లి,నవంబరు3(ఆంధ్రజ్యోతి)నేలకొండపల్లి శ్రీభక్తరామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం రాజేశ్వరపురం గ్రామంలో ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరంలో మొత్తం 150 మంది రోగులను వైద్యులు పరీక్షించారు. ఉచితంగా మందులు అందచేశారు. నిష్ణాతులైన 12 మంది వైద్యులు వైద్య సేవలందించారు. క్యాంపు చైర్మన్ నెల్లూరి వీరబాబు మాట్లాడుతూ భక్తరామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో అనేక వైద్యశిబిరాలను నిర్వహించామన్నారు. ఎన్నో సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు. పేదలకు వైద్యాన్ని కొంత మేరకైనా అందుబాటులోకి తేవాలన్న సదుద్దేశ్యంతోనే సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు వెల్లంపల్లి శ్రీనివాసరావు, అధ్యక్షుడు పొన్నగాని శ్రీనివాస్, యలమద్ది లెనిన్, పాలడుగుపూర్ణచంద్రప్రసాద్, గెల్లా వెంకటరమణగుప్తా, పచ్చా తిరపతయ్య, కోడూరి వెంకటాచారి, చావా గణపతిరావు, దండా రవీంద్రబాబు,దేవీప్రసాద్, ఓరుగంటి నారాయణరావు పాల్గొన్నారు.

అణచివేత ఉన్నతకాలం

ప్రశ్నించేవారు పుడుతుంటారు

మాస్‌లైన్ జిల్లా కార్యవర్గ సభ్యుడు

ఖమ్మంసంక్షేమవిభాగం, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): దేశంలో దోపిడీ, అణచివేత ఉన్నంతకాలం ప్రశ్నించే వారు పుడుతూనే ఉంటారని, నక్సలిజం ఉంటాయని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జీ రామయ్య పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మం నగరంలోని కైకొండాయిగూడెంలో మాస్‌లైన్ గ్రామశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అమరవీరుల సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. హిందు పాసిజాన్ని పెంచి పోషిస్తున్న అమిత్ షా తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. దేశంలో అత్యవసర పరిస్థితిని విధించిన ఇందిరాగాంధీ సైతం తర్వాత ప్రజాగ్రహం చూసి ఓటమి పాలైందన్నారు. అమరవీరులు ఆశయాల కోసం నేడు ప్రజాస్వామ్యవాదులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జాలాది లెనిన్, కే శ్రీనివాస్, జే లెనిన్, బోమ్మకంటి రమేశ్, రామనాథం, ములకలపల్లి లక్ష్మీనారాయణ, రచబంటి రవి, నాగయ్య భరత్, శోభన్, పాషాపాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంటౌన్,నవంబరు3(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోవటంతో ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. నగరంలోని మంచికంటి హాల్‌లో ఆదివారం నిర్వహించిన సీపీఎం టూటౌన్ కమిటీ మహాసభలో మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మినహా మరే పథకం సక్రమంగా అమలుకావటం లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకోసం కమ్యూనిస్టు పార్టీలు ఉద్యమాలు నిర్వహిస్తూ కీలకంగా వ్యవహరించాలన్నారు. బీజేపీ ప్రభుత్వం మత ఘర్షణలకు కుట్రలు చేస్తున్నదని ఆ ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.బీఆర్ఎస్, కాంగ్రెస్ విధానాల వల్ల రాష్ట్రంలో బలపడేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదన్నారు.ఈ సమావేశంలో మచ్చా సూర్యం, కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, ఐలూ రాష్ట్ర కార్యదర్శి కొల్లి సత్యనారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీకాంత్, వై. విక్రమ్ కళ్యాణం వేంకటేశ్వరరావు, బీవీకే ట్రస్ట్ మేనేజర్ వైశ్రీనివాసరావు, జిల్లా కమిటీసభ్యులు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులతో
అన్నదాతల ఆందోళన

» ముసురు, చిరుజల్లులతో ఆరని ధాన్యం » ధర తగ్గించిన ప్రైవేటు వ్యాపారులు



వేంసూరు మండలం మర్లపాడులో ధాన్యం కొనుగోలు కేంద్రం

సత్తుపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):సత్తుపల్లి నియోజకవర్గంలో రైతులు సాగు చేసిన వరి కోతలు ప్రారంభమయ్యాయి. నియోజకవర్గంలో ఇప్పటికే రైతులు 13వేల ఎకరాల్లో వరి కోతలు పూర్తి చేశారు. నూర్పిళ్లు చేసిన రైతులు కొందరు ప్రభుత్వం ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని ఎదురుచూస్తుండగా, మరి కొందరు రైతులు ప్రైవేటు వ్యాపారులకు తమధాన్యం అమ్ముకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలంటే నిర్ణీత తేమ శాతం ఉంటేనే సాధ్యపడే పరిస్థితి ఉంది. కాని వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటూ ఉండటం, చిరుజల్లులు కురుస్తుండడం, కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో ధాన్యం ఆరబెట్టే అవకాశం లేక కల్లాల్లోనే కొందరు రైతులు ధాన్యం తెగనమ్ముకుంటున్నారు.

1.26లక్షల ఎకరాల్లో వరి సాగు

సత్తుపల్లి నియోజకవర్గంలో రైతులు ఈ వర్షాకాలం సీజన్లో 1,26,946 ఎకరాల్లో వరి సాగు చేసారు. తల్లాడ మండలంలో 23,300 ఎకరాలు, కల్లూరు మండలంలో 33,340 ఎకరాల్లోనూ, సత్తుపల్లి మండలంలో 19,506 ఎకరాలు, పెనుబల్లి మండలంలో 23,500, వేంసూరు మండలంలో 27,300ఎకరాల్లో వరి సాగు చేయగా అధిక శాతం సన్నరకం ధాన్యం సాగు చేశారు. వీటిలో ఇప్పటికే సత్తుపల్లి మండలంలో 4,800 ఎకరాల్లో, తల్లాడ మండలంలో 6వేల ఎకరాల్లో, కల్లూరు మండలంలో వెయ్యి ఎకరాల్లోనూ, పెనుబల్లిలో 300, వేంసూరులో 600 ఎకరాల్లో వరి కోతలు పూర్తి చేశారు.

ప్రారంభమవుతున్న కొనుగోలు కేంద్రాలు

నియోజకవర్గంలోని సత్తుపల్లి మండలంలో 15,, కల్లూరు మండలంలో 14, పెనుబల్లిలో 20, తల్లాడ మండలంలో అయిదు కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. మరి కొన్ని కేంద్రాలు ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మొదట్లో గన్నీ సంచుల సమస్య ఉన్నా ఇప్పుడిప్పుడే కేంద్రాలకు సంచులు సరఫరా అవుతున్నాయి.

అనకూలించని వాతావరణం

వరి కోతలు ఊపందుకుంటూ ఉండడంతో రైతులు వరి నూర్పిళ్లు చేసి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. కాని వాతావరణం అనుకూలించక రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి కోతలు, నూర్పిళ్లు ప్రారంభమైన వెంటనే కేం ద్రాలు ఏర్పాటు కాకపోవడంతో ప్రైవేటు వ్యాపారులు రంగంలోకి దిగారు. 75కిలోల సన్నరకం ధాన్యం బస్తా రూ.1,650లకు కొనుగోలు చేశారు. దీంతో రైతులు కూడా కల్లాల్లోనే ధాన్యం విక్రయించారు. ధాన్యం ఆరబెట్టటం, రవాణా లాంటి సమస్యలు ఉండవని కల్లాల్లోనే విక్రయించారు. వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడం వర్షాలు కురుస్తుండటంతో ధాన్యం ఆరబెట్టే పరిస్థితి లేక కొనుగోలు కేంద్రాలకు తరలించే అవకాశం లేకపోవడంతో రైతులు దిక్కు తోచని స్థితిలో పడ్డారు. దీనికి ఆసరగా తీసుకొని ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు ధరను గణనీయంగా తగ్గించారు. ప్రస్తుతం 75కిలోల ధాన్యం బస్తాను గరిష్ఠంగా రూ.1,450కే కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించేందుకు ప్రస్తుతం వెనక్కి తగ్గుతున్నారు. ఒక వైపు ధాన్యం ఆరబెట్టే అవకాశం లేక, మరో వైపు ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు ధర గణనీయంగా తగ్గించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రానున్న రెండు, మూడు రోజుల్లో కూడా వర్షాలు కురుస్తాయనే సమాచారంతో వరి కోతలు, నూర్పిళ్లు వాయిదా వేయాలని రైతులు భావిస్తున్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

» ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

కారేపల్లి, నవంబరు3(ఆంధ్రజ్యోతి): రైతులు వరి ధాన్యం విక్రయకేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కోరారు. ఆదివారం మండల పరిధిలోని విశ్వనాథపల్లి పంచాయతీ కారేపల్లి క్రాస్‌రోడ్డులో సహకార సొసైటీ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. సన్న, దొడ్డు వరి రకాలకు మద్దతు ధర రూ.2320గా నిర్ణయించడం జరిగిందని తెలిపారు. అలాగే బోనస్‌గా క్వింటాకు రూ.500 చెల్లిస్తున్నట్లు తెలిపారు. దళారులను నమ్మిమోసపోకుండ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలలోనే ధాన్యం విక్రయించుకోవాలన్నారు. రైతులకు వారం రోజులలో వారి బ్యాంకు ఖాతాలలో డబ్బులు జమ అవుతాయాన్నారు. సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాస్‌రావు అధ్యక్షతన ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ నవీన్‌బాబు, తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీడీవో సురేందర్, ఏవో బట్టు అశోక్‌కుమార్, సీఈవో బొల్లు హనుమంతరావు, పార్టీ మండల అధ్యక్షుడు చంద్రప్రకాష్, బానోత్ రాంమూర్తి నాయక్, పగడాల మంజులా, మాజీ ఎంపీపీ బానోత్ దేవ్లా నాయక్, ఇమ్మడి తిరుపతిరావు, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మండల పరిధిలోని సూర్యతండాలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడ ధారవత్ చిన్నానాయక్ విగ్రహాన్ని ఆదివారం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఆవిష్కరించారు. గత ఏడాది అనార్యోగంతో మృతి చెందిన చిన్ననాయక్ జ్ఞాపకార్థం తండాలో విగ్రహం ఏర్పాటు చేశారు. అదే విధంగా మండల కేంద్రంలో అనిల్ అనే యువకుడు ఏర్పాటు చేసిన డిజిటల్ ఫ్లెక్సీ యూనిట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

మున్నేరు వరద బాధితులకు దుప్పట్ల పంపిణీ

ఖమ్మంక్రైం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మున్నేరు వరద బాధితులకు అభయ ఫౌండేషన్, దేవకి ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లు, చాపలు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దేవకి వాసుదేవరావు ఆదివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ ఇప్పటి వరకు వరద బాధితులకు సుమారు రూ.70లక్షల నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు తెలిపారు. గతంలో ఎన్నడులేని విధంగా ఖమ్మం నగరంలో వరద రావడానికి రాష్ట్ర ప్రభుత్వం తప్పుకూడా ఉందని, ఆరోపించారు. ఈకార్యక్రమంలో వనమా వేణుగోపాలరావు, చంద్రశేఖర్, జయంత్‌పటేల్, కేశవలాల్‌పటేల్, నకిరికంటి భద్రం లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అందరూ గర్వపడేలా సేవలందించాలి

» రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహనిర్మాణ శాఖమంత్రి పొంగులేటి



నాయబ్ రసూల్‌ను సన్మానిస్తున్న మంత్రి పొంగులేటి

సత్తుపల్లిరూరల్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అందరూ గర్వపడేలా సేవలందించాలని రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహనిర్మాణ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సత్తుపల్లిలోని జామె మసీద్ సదర్‌గా నూతనంగా ఎన్నికైన షేక్ నాయబ్ రసూల్ ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రసూల్‌ను మంత్రి పొంగులేటి ఘనంగా సన్మానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ముస్లిం కుటుంబాల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు, మునిసిపల్ కౌన్సిలర్ గ్రాండ్ మౌలాలీ, నాయకులు మోనార్క్ రఫీ, యూసఫ్ మజీద్, షఫీ, భాషా వలీ, అనాస్, ఆదిల్‌షరీఫ్ తదితరులున్నారు.

జీవితాంతం గుర్తుండిపోయేవి మధుర స్మృతులు

» ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి



ఎమ్మెల్యే రాగమయి, దయానంద్ దంపతులను సన్మానిస్తున్న నిర్వాహకులు

సత్తుపల్లి, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): సకల జనుల వనసమారాధనతో మధుర స్మృతులు జీవితాంతం గుర్తుండిపోతాయని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. హిందూ భక్త ధార్మిక మండలి, ప్రసన్న గణపతి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం జేవీఆర్ పార్క్ సమీపంలోని మనగుడి ప్రాంగణంలో నిర్వహించిన సకల జనుల వనసమారాధనలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహకులు ఎమ్మెల్యే రాగమయి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ దంపతులను శాలువాతో సన్మానించారు. ఆంధ్రాలోని కామయ్యపాలెంలోని శ్రీదత్త సాయి ఆశ్రమ నిర్వహకులు అనఘానంద స్వామిచే ప్రవచనలు ఇచ్చారు. మధ్యాహ్నం కార్తీక సమారాధన భోజనాల నిర్వహించారు. ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులచే ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పేదలకు అండగా సీపీఎం

» సీపీఎం రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వరరావు

మధిరరూరల్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): పేదలకు నిత్యం అండగా ఉండేది సీపీఎం పార్టీ ఒక్కటేనని సీపీఎం రాష్ట్ర నాయకుడు పొన్నం వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం మధిర మునిసిపాలిటీ పరిధిలోని మడుపల్లి గ్రామంలో సీపీఎం మధిరపట్టణ మహాసభను ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన మహాసభలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని విమర్శించారు. తెలంగాణలో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నాయకులు, కార్యకర్తలు ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం మధిర పట్టణ నూతన కార్యదర్శిగా పడకంటి మురళీని ఎంపిక చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చింతలచెర్వు కోటేశ్వరరావు, మా దినేని రమేష్, శీలం నర్సింహారావు, బండి పద్మ, మందా సైదులు, రాధాకృష్ణ, పణీంద్రకుమారి, పడకంటి మురళీ, మద్దాల ప్రభాకర్ పాల్గొన్నారు.

'ఐక్యంగా పనిచేయాలి'

తల్లాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ఆశయ సాధన కోసం ఐకమత్యంతో పని చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ, ఇస్నేపల్లి అశోక్ మాదిగ అన్నారు. ఆదివారం తల్లాడ మండలం నారాయణపురం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన మండల విస్తృత సమావేశంలో వారు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎంఆర్పీఎస్ తల్లాడ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎక్కిరాల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా కన్నెపోగు సురేష్, ప్రధాన కార్యదర్శిగా వైదా, అధికార ప్రతినిధిగా ఆదూరి సుధాకర్, కార్యదర్శిగా కత్తి శివలను ఎన్నుకున్నారు.

సమగ్ర కుల గణన సర్వే ప్రారంభం



కల్లూరులో మాట్లాడుతున్న ఆర్డీవో రాజేంద్రగౌడ్

కల్లూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణనలో భాగంగా ఆదివారం నుంచి ఇళ్లను సందర్శించి ఇళ్ల జాబితా సర్వే, స్టిక్కర్లు వేసే కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ఆర్డీవో ఎల్.రాజేంద్రగౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్యూమరేటర్లకు పలు సూచనలు చేశారు. డివిజన్ వ్యాప్తంగా 90,535 ఇళ్ల సందర్శించి జాబితా రూపొందించనున్నట్లు తెలిపారు. దీనికి గాను 651 మంది ఎన్యూమరేటర్లు, 65 మంది సూపర్‌వైజర్లను నియమించినట్లు తెలిపారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ సాంబశివుడు, ఎంపీడీవో చంద్రశేఖర్‌లు ఉన్నారు.

వేంసూర్: ఇళ్ల జాబితా తయారీ కార్యక్రమాన్ని వేంసూరు తహసీల్దార్ ఎంఎ.రాజు ఆదివారం వేంసూరులో పరిశీలించారు. స్టిక్కర్లు వేసే కార్యక్రమాన్ని చూసి నిబంధనల మేరకు జాబితా రూపొందించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీఈవో రంజిత్‌కుమార్ ఉన్నారు.

మధిరటౌన్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): ఇంటింటి సర్వే ప్రక్రియకు సంబంధించిన కార్యక్రమం ఆదివారం మధిర పట్టణంతో పాటు మండలంలో అన్ని గ్రామాల్లో ప్రారంభమైంది. సమగ్ర కుటంబ సర్వే చేపట్టే ఇళ్లకు స్టిక్కర్లు అంటించే కార్యక్రమాన్ని తహసీల్దార్ రాంబాబు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ సంపత్ కుమార్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బోనకల్, నవంబరు 3: మండలంలోని చిరునోముల గ్రామంలో ఆదివారం సమగ్ర కుల గణన ఇంటింటా సర్వే కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి సురేందర్, సిబ్బందితో కలిసి ఇళ్లను సందర్శించి పోస్టర్లను అంటించారు. సర్వేను తహసీల్దార్ పున్నమ్ చందర్, ఎంపీడీవో ఆర్. రమాదేవి, ఉపేందర్‌లు పర్యవేక్షించారు.



మధిరటౌన్‌లో స్టిక్కర్ అంటించే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్



బోనకల్‌లో ఇళ్లకు స్టిక్కర్లు వేస్తున్న అధికారులు

బోనకల్‌లో ఉచిత వైద్య శిబిరం

బోనకల్, నవంబరు 3: బోనకల్‌లో బత్తినేని చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. వైద్య శిబిరాన్ని ట్రస్టు చైర్మన్ బత్తినేని నాగ ప్రసాద్ ప్రారంభించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరజీవి తూము ప్రకాశరావు ఆశయ స్ఫూర్తితో ప్రతి నెల ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. పేదలకు ఉపయోగ పడేలా నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పవన్ కుమార్, సాయి కుమార్, సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, బొమ్మినేని కొండలరావు, ఆకేన పవన్, యంగల గిరి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



మందులను పంపిణీ చేస్తున్న బత్తినేని నాగప్రసాద్

సాగర్ కాలువ గండికి మరమ్మతులు



కాలువకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

చింతకాని, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బస్వాపురం గ్రామ సమీపంలోని చింతకాని మేజర్ సాగర్ కాలువకు ఇటీవల కురిసిన వర్షాలకు గండి పడింది. ఆదివారం అధికారులు గండికి మరమ్మతు పనులు చేపట్టారు. రెండు రోజుల్లో పనులు పూర్తి చేసి నీళ్ల విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.

విరాళం అందజేత



దాతలను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సత్తుపల్లిరూరల్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ద్వారకాపూరి కాలనీలో నిర్మాణంలో ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయానికి వీరిశెట్టి కుటుంబ సభ్యులు రూ.2,30,616నగదు విరాళంగా అందించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దాతలు వీరిశెట్టి ప్రవీణ్‌కుమార్, శ్వేత దంపతులు ఆదివారం ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ద్రోణంరాజు మల్లిఖార్జునశర్మ, సోమిశెట్టి శ్రీధర్, ఉబ్బల వెంకటేశ్వరరావు, రాగాల చంద్రారెడ్డి, రాగాల రమేష్‌రెడ్డి, దాతల కుమార్తెలు గ్రీష్మ, సుష్మ తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో క్రీడాకారిణులకు క్రీడా దుస్తుల పంపిణీ

కల్లూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా జూనియర్ ఖోఖో బాలికల జట్టుకు క్రీడా దుస్తులను ఆదివారం కల్లూరులో అందజేశారు. మహబూబ్‌నగర్‌లో ఈ నెల 28 నుంచి జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ఖమ్మం జిల్లా ఖోఖో జూనియర్ బాలికల జట్టు క్రీడాకారులు పాల్గొననున్నారు. జట్టులోని క్రీడాకారిణులకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు నుంచి పొంగులేటి మాధురి క్రీడా దుస్తులను అందజేశారు. వీటిని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కే.నరసింహమూర్తి వారికి అందజేసి అభినందనలు తెలిపారు. ఆటల్లో రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాక్షించారు.



క్రీడా దుస్తులు అందజేస్తున్న నరసింహామూర్తి

ఆర్థిక సాయం అందజేత



కిరణ్‌ను సన్మానిస్తున్న బొర్రా రాజశేఖర్

వైరా, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ ఏడో వార్డులోని బ్రాహ్మణపల్లి అగ్రహారంలో మత్స్యకార కుటుంబానికి చెందిన మెడిసిన్ విద్యార్థి కాండ్ర కిరణ్ అనే విద్యార్థికి రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్ రూ.పదివేలు ఆర్థికసాయం చేశారు. కిరణ్‌ను ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో చేపల సొసైటీ అధ్యక్షుడు షేక్.రహీం, పోటు మధుసూదన్, షేక్.సైదులు, బాషా, సైదాఖాన్, సలీం, కుదాన్, అక్బర్, అజీమ్, రాజా, కాండ్ర కాంతారావు, రాము పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజలు

తల్లాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం మల్లవరం, లక్ష్మీపురం గ్రామాల్లో శనివారం రాత్రి అయ్యప్పస్వామి పడిపూజలు ఘనంగా జరిగాయి. మల్లవరంలోని అయ్యప్ప కల్యాణ మండపం, లక్ష్మీపురంలో వేమిరెడ్డి రామిరెడ్డి గృహంలో పడిపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు.



పడిపూజలో పాల్గొన్న అయ్యప్ప భక్తులు

కొత్త మేడేపల్లిని సందర్శించిన ఎస్ఐ

ఏన్కూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తమేడేపల్లి గ్రామాన్ని ఆదివారం ఎస్ఐ రఫీ సందర్శించారు. గ్రామస్థులతో మాట్లాడారు. జీవనస్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో 45కుటుంబాలకు చెందిన 150మంది నివసిస్తూ ఉన్నారు. విద్యా, వైద్యం, రహదారి, విద్యుత్, తాగునీటికి సమస్యలతో బాహ్య ప్రపంచానికి దూరంగా ఉంటున్నారు. చిన్నారులకు బిస్కెట్లు, అరటిపండ్లు ఎస్ఐ పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో పోలీసు సిబ్బంది సైదా, నరేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.



చిన్నారులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎస్ఐ రఫీ

ఆటోను ఢీకొట్టిన కారు

● డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

ముదిగొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆటోను కారు ఢీకొన్న సంఘటనలో ఆటోడ్రైవర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన ముదిగొండ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. ఖమ్మం నుంచి ముదిగొండ వైపు వస్తున్న ఆటోను, వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో పల్టీకొట్టగా, డ్రైవర్ ఆకారపు దామోదర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

» సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంటౌన్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు పరచడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. నగరంలోని మంచికంటి హాల్‌లో ఆదివారం నిర్వహించిన సీపీఎం టూటౌన్ కమిటీ మహాసభలో ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మినహా మరే పథకం సక్రమంగా అమలుకావడం లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం కమ్యూనిస్టు పార్టీలు ఉద్యమాలు నిర్వహిస్తూ కీలకంగా వ్యవహరించాలన్నారు. దేశంలో సంపదతో పాటు పేదరికం పెరుగుతోందని, ఆకలి సూచీలో 55వ స్థానంలో ఉన్న భారత్, మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత 105వ స్థానానికి పడిపోయిందన్నారు. మైనారిటీలను లక్ష్యంగా చేసుకొని వారికి వ్యతిరేక చట్టాలను రూపొందిస్తున్న బీజేపీ ప్రభు త్వం మత ఘర్షణలకు కుట్రలు చేస్తున్నదని ఆ ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ విధానాల వల్ల రాష్ట్రంలో బలపడేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదన్నారు. దోపిడి విధానాలను తిప్పికొట్టి సమసమాజ స్థాపనే కమ్యూనిస్టుల లక్ష్యమన్నారు. మచ్చా సూర్యం అధ్యక్షతన జరిగిన మహాసభలో కార్యదర్శి బోడపట్ల సుదర్శన్ నివేదిక సమర్పించారు. ఈ మహాసభలో ఐలూ రాష్ట్ర కార్యదర్శి కొల్లి సత్యనారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీకాంత్, వై. విక్రమ్ కళ్యాణం వెంకటేశ్వరరావు, బీవీకే ట్రస్ట్ మేనేజర్ వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అద్దె భవనంలో ఎక్సైజ్ కార్యాలయం

» పునాది దశలోనే ఆగిపోయినడ నూతన కార్యాలయ నిర్మాణ పనులు



అద్దెభవనంలో కొనసాగుతున్న ఎక్సైజ్‌శాఖ కార్యాలయం

కారేపల్లి, నవంబరు3(ఆంధ్రజ్యోతి): కారేపల్లి మండలంలో ఎక్సైజ్ కార్యాలయంలో గత కొన్నేళ్లుగా అద్దె భవనంలో కొనసాగుతుంది. కారేపల్లి మండలంతో పాటు కామేపల్లి, ఏన్కూర్ మండలాల్లో నాటు సారాయిని నియంత్రించేందకుగాను మూడు మండాలాలకు కలిపి 20 ఏళ్ల కితం ఏర్పాటు చేసిన ఎక్సైజ్ కార్యాలయంలో కనీస సౌకర్యాలు లేకుండా అద్దెభవనంలో కొనసాగుతుంది. కార్యాలయాన్ని ముందు మండల కేంద్రంలో ఏర్పాటు చేశారు.ఐదేళ్ల క్రితం కారేపల్లి క్రాస్‌రోడ్డుకు మార్చారు. ప్రస్తుతం ఉన్న అద్దెభనంలో ఏలాంటి సౌకర్యాలు లేవని, సరైన రోడ్డు మార్గం కూడా లేదని సిబ్బంది వాపోతున్నారు. అయితే మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం పక్కన ప్రభుత్వం మూడు కుంటల భూమిని కేటాయించింది. 22లక్షల రూపాయలతో భవనం నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు. కాగా కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టి పునాది దశను పూర్తి చేశాడు. సంబంధిత కాంట్రాక్టర్ తొలి బిల్లు కోసం అధికారులు చుట్టు తిరిగాడు అధికారులు స్పందించక పోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. తరువాత దానిని పట్టించుకునేవారే లేకుండపోయారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారులు స్పందించి మండల కేంద్రంలో ఎక్సైజ్‌శాఖ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.